ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 21.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 1 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

పాఠకులు, ప్రకటనకర్తలు,
మిత్రులు శ్రేయోభిలాషులకు
రంజాన్ శుభాకాంక్షలు

ఈద్ ముబారక్

మా సంకల్పానికి మీ ఆదరణే బలం

నిజాలను నిర్భయంగా రాయాలని, ప్రజల పక్షాన నిలబడి, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలనే దృఢ సంకల్పంతో ప్రారంభమైన 'ప్రతిపక్షం' తెలుగు దినపత్రిక విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుని ద్వితీయ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. గత రెండు సంవత్సరాల క్రితం సీనియర్ జర్నలిస్టు మహమ్మద్ ఫజుల్ రహమాన్ సంపాదకత్వంలో ప్రారంభమైన 'ప్రతిపక్షం' తెలుగు దిన పత్రిక అశేష పాఠకుల మన్ననలు పొందుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిరాటంకంగా వెలువడుతోంది. సరిగ్గా రెండేండ్ల క్రితం తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో 'ప్రతిపక్షం' తెలుగు దినపత్రిక ఊపిరిపోసుకుంది. ఏ ఆకాంక్షలు, ఆశయాలతో అయితే ఆ పత్రికను ప్రారంభించామో ఆ ఆకాంక్షలు, ఆశయాలను తూచా తప్పకుండా కొనసాగించామని భావిస్తున్నాం. పత్రికలు విశ్వసనీయత కోల్పోతున్న తరుణంలో పెద్ద పత్రికలు పెట్టుబడిదారుల చేతిలోనూ, రాజకీయ పార్టీల చేతిలోనూ కొనసాగుతున్న సమయంలో, అనేకానేక డిజిటల్ పత్రికలు పాఠకులకు ముంచెత్తుతున్న సమయంలో, సోషల్ మీడియా తీవ్రంగా రాజ్యమేలుతున్న పరిస్థితులలో 'ప్రతిపక్షం' దినపత్రిక ధైర్యంగా ముందడుగు వేసింది. రెండేండ్లుగా రోజూ ఉదయం 'ప్రతిపక్షం' పాఠకులను పలకరిస్తూ ఉంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడం, అధికార వ్యవస్థ లోపాలను వెలుగులోకి తెచ్చి, ప్రజల వేదనను అక్షరాల రూపంలో బయటకు తీసుకురావడమే లక్ష్యంగా 'ప్రతిపక్షం' ముందుకు సాగింది. ఎన్నో వ్యయ ప్రయాసలు, ఆటంకాలు ఎదురైనా పాఠకుల ఆదరణతో నిలబడి, ప్రజల పక్షాన పోరాడుతున్నాం. పత్రిక సంపాదకులు మహమ్మద్ ఫజుల్ రహమాన్ గత జనవరి 9న ఆకస్మికంగా మరణించడం 'ప్రతిపక్షం' కు తీరని లోటు. అయితే ఆయన ఆశయాలు, ఆలోచనలు అనుసరిస్తూ పత్రికను ముందుకు తీసుకెళుతున్నాం. 'అధికారానికి ఎదురు నిలువడం అంటే శబ్దం చేయడమే కాదు, కొన్నిసార్లు నిశ్శబ్దంగా నిజాన్ని నిలబెట్టడమే గొప్ప ధైర్యం' అన్న ఆయన ఆశయాలే స్ఫూర్తిగా 'ప్రతిపక్షం' దినపత్రిక ధైర్యంగా, సగర్వంగా వెలువడుతోంది. 'ప్రతిపక్షం' పత్రిక ఆయన కలల ఫలితం. సత్యానికి ఆశ్రయంగా, ప్రజల హక్కుల ఆయుధంగా, అణచివేతకు ఎదురుగా నిలిచే బలమైన స్వరంగా 'ప్రతిపక్షం' నిలుస్తోంది. పాఠకుల హృదయాల్లో 'ప్రతిపక్షం' సుస్థిర స్థానం ఏర్పరుచుకుంది. ప్రజల పక్షాన నిలబడి పోరాటాన్ని తన పోరాటాన్ని కొనసాగించిన పత్రిక సంపాదకులు ఫజుల్ రహమాన్ చూపిన దారిలో 'ప్రతిపక్షం' కొనసాగుతుంది. ప్రజల హక్కులు సాధనే లక్ష్యంగా 'ప్రతిపక్షం' నడుస్తూనే ఉంటుంది. ప్రజల పక్షాన పోరాడుతూ 'ప్రతిపక్షం' నిరాటంకంగా వెలువడుతుంది. మా సంల్పానికి మీ పాఠకుల ఆదరణే బలం. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో 'ప్రతిపక్షం' మున్ముందు మరెన్నో వార్షకోత్సవాలు జరుపుకుంటుందని ఆశిస్తూ..

- మహమ్మద్ అజీజ్ ఉర్ రహమాన్
ఎడిటర్,పబ్లిషర్

ప్రతిపక్షం

హైదరాబాద్

శనివారం
21.03.2026

వార్షికోత్సవం

ద్వితీయ వార్షికోత్సవం జరుపుకుంటున్న 'ప్రతిపక్షం' తెలుగు దినపత్రిక యాజమాన్యం, సిబ్బందికి శుభాకాంక్షలు. ప్రజా సమస్యలే ఎజెండాగా కొనసాగుతున్న పత్రిక. ముందు ముందు మరిన్ని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి వాటి అమలుకు కృషి చేయాని ఆశిస్తూ...

- జి. కిషన్ రెడ్డి, కేంద్ర మంత్రి

ప్రతిపక్షం దినపత్రికకు ద్వితీయ వార్షికోత్సవ శుభాకాంక్షలు... సినియర్ పాత్రికేయులు, మిత్రులు ఫజుల్ రహమాన్ సారథ్యంలో రెండేళ్ల క్రితం ప్రారంభమైన 'ప్రతిపక్షం' దినపత్రిక తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ వస్తున్న తరుణంలో ఆత్మీయులు ఎడిటర్ ఫజుల్ రహమాన్ మన మధ్య లేకపోవడం బాధాకరమైన విషయం. అయినప్పటికీ పత్రిక ప్రజా గొంతుకగా నిరాటంకంగా కొనసాగడం అభినందనీయం.

- పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రి

ప్రజా సమస్యలే ఎజెండాగా... ప్రతి సమస్యను ప్రభుత్వాన్ని ప్రశ్నించే 'ప్రతిపక్షం' దినపత్రిక నిర్విరామ పోరాట స్ఫూర్తిని నింపుకొని 2వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పత్రిక యాజమాన్యానికి శుభాకాంక్షలు. ప్రజా ఎజెండానే తమ ఎజెండాగా నిజమైన 'ప్రతిపక్షం' పాత్రను పోషించడం అభినందనీయం.

- కల్వకుంట్ల కవిత, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

అప్రతిహతంగా కొనసాగుతూ 'ప్రతిపక్షం' దినపత్రిక రెండవ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి దినపత్రికను నిరాటంకంగా తీసుకొస్తున్న యాజమాన్యం కృషి అభినందనీయం.

- కె. శ్రీనివాస్ రెడ్డి,
తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్

పత్రికను నడపడం సామాన్యమైన విషయం కాదు. అలాంటి సాహసోపేతమైన ప్రయాణాన్ని ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రెండేళ్లుగా నిర్విరామంగా కొనసాగిస్తున్న 'ప్రతిపక్షం' దినపత్రిక యాజమాన్యం, సిబ్బందికి శుభాకాంక్షలు. నికార్సయిన ఒక పత్రికను నడపాలనేది 'ఫజుల్ భాయ్' చిరకాల కోరిక. ఆయన తదనంతరం పత్రిక బాధ్యతలు చేపట్టిన నిరాటంకంగా కొనసాగిస్తున్న ఆయన కుమారుల పట్టుదల అభినందనీయం.

- విరాహత్ అలీ, అధ్యక్షులు
టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

"సంతోషాన్ని దోచుకుంటున్న స్మార్ట్ యుగం"

సంతోషమే సగం బలం అని పెద్దలు అన్నారు గానీ...నిజానికి సంపూర్ణ బలం. మనిషిలో సంతోషానికి సూచిక చిరునవ్వే. ఆ నవ్వు రావాలంటే సంతోషంగా ఉండాలి. నేటి ఆధునిక యుగంలో ఇది మనిషి నుంచి రోజురోజుకు దూరమైపోతుంది. దీంతో మనిషి తీవ్ర ఒత్తిడికిలోనై తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో సంతోషం యొక్క ప్రాముఖ్యతను గుర్తించిన మొదటి దేశం భూటాన్. 1970 వ సంవత్సరం నుంచే సంతోష సూచే నిజమైన ఆరోగ్య సూచీగా ప్రపంచానికి చాటింది. ఇక్కడ "జాతీయ ఆదాయం" కన్నా "జాతీయ సంతోషానికీ" అధిక ప్రాధాన్యత ఇస్తారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని 2013 నుంచి ఐక్యరాజ్య సమితి సంతోషం ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా

సంపతి రమేష్
7989579428

తెలియజేస్తూ, ప్రజల జీవన విధానంలో మార్పు తేవడానికి ఈ సంవత్సరం మార్చు 20న జరిగిన అంతర్జాతీయ సంతోష దినోత్సవ సందర్భంగా వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ 2026 ను విడుదల చేసింది. వివిధ దేశాల సంతోష స్థాయిలను వివరించింది. ఆధునిక కాలంలో అందుబాటులోకి వచ్చిన సోషల్ మీడియా యువతలో ఆనందాన్ని ఆవిరి చేస్తుంది. లేనిపోని ఆందోళనలకు కారణమవుతున్నదనీ ఈ రిపోర్ట్ అభిప్రాయపడింది. డిజిటల్ వ్యసనం, సోషల్ మీడియా వల్ల కలిగే ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ కేసులు పెరుగుతున్నాయని భారత ఆర్థిక సర్వే 2025 26 కూడా స్పష్టం చేసింది. ఈ క్రమంలో టెలిమానస్ వంటి డిజిటల్ ప్లాట్ ఫామ్ ను విస్తరించి డిజిటల్ వ్యసనాన్నీ, మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని సూచించింది.

సంతోషం పరిమితమే!

ప్రస్తుత సాంకేతిక యుగంలో ఆందోళన, ఒత్తిడి, అసంతృప్తి వంటివి సమాజంలో ఎక్కువైపోయాయి. దీంతో మనిషి నిరాశా, నిస్పృహల్లో జారుకుంటున్నాడు. ఇంతేకాకుండా నిత్యం ఈర్ష్య, ద్వేషం, పగ, ప్రతీకారంతో సంఘర్షణాత్మక జీవితాన్ని గడుపుతున్నాడు. కానీ భూగోళంపై మనిషి ఆనందానికి మించిన మందు లేదు. సంతోషమే మనల్ని మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచగలదని మనస్తత్వ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో "ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి సొల్యూషన్ నెట్ వర్క్" ఆధ్వర్యంలో "స్థూల జాతీయ ఆనందం" ఆధారంగా "ప్రపంచ సంతోష సూచి" ని కూడా ప్రతియేటా గణించడం జరుగుతుంది. దీనిలో ఆదాయం, ప్రజల ఆరోగ్య జీవనం, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, తక్కువ అవినీతి తదితర అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ఏడాది 147 దేశాలలో కూడిన ప్రపంచ సంతోష సూచిలో ఫిన్లాండ్ తొమ్మిదవసారి ప్రపంచంలోనే అత్యంత సంతోషకరమైన దేశంగా మొదటిస్థానంలో నిలిచింది. అక్కడ విద్యకు ప్రాధాన్యతనిస్తారు, అందరూ మమేకమై ఐకమత్యంతో జీవిస్తారు. మరి, ప్రపంచంలో ఐదవ ఆర్థిక వ్యవస్థగా దూసుకుపోతున్న భారత్ మాత్రం సంతోషకరమైన దేశాల జాబితాలో 116 స్థానానికే పరిమితమైనది. ఇక్కడ కుల, మతతత్వం వంటి విద్వేష భావాజాలాలే ఇందుకు నిదర్శనం. ఇండియా గతేడాది కన్నా స్వల్పంగా మెరుగైనప్పటికీ పొరుగు దేశాలైన చైనా(65), నేపాల్(99), పాకిస్తాన్(104) కన్నా తక్కువే. ఆఫ్ఘనిస్తాన్ అట్టడుగు స్థానంలో ఉంది. రోజురోజుకు అవిరవుతున్న ఆనందం ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతూ మానవ వనరుల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆర్థిక, సామాజిక జీవితంలో మార్పు తీసుకొస్తూ, ఆనందాన్ని నింపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. ఇందుకై సంస్థాగత విశ్వాసాన్ని బలోపేతం చేయడం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రజా విధానంలో సమగ్రపరచాలి.

సంతోషమే నిజమైన ఆస్తి.

మనిషి సంతోషంగా ఉంటేనే సానుకూల దృక్పథం పెరిగి, సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. ఆనందంగా ఉండేవాళ్లలో ఆత్మవిశ్వాసం అధిక స్థాయిలో ఉంటుంది. కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని అనేక శాస్త్రీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తూ, ఆనందాన్ని నింపడానికి ఐక్యరాజ్యసమితి 2015 వ సంవత్సరంలో "సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు"ను కూడా నిర్దేశించింది. వాటి ముఖ్య లక్ష్యం కూడా మానవుడు సంతోషం, శ్రేయస్సుతో బతకడమే. జీవితమనే సుడిగుండాన్ని ఈదలంటే సమస్యలనేవి ప్రతిఒక్కరికీ సర్వసాధారణం. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్ళాలి. దీనికి విరుద్ధంగా కొందరు వ్యసనాలకు బానిసై కృత్రిమ ఆనందాన్ని కోరుకోవడం సరికాదు. ఇది మరింత ప్రమాదానికి దారి తీస్తుంది. పాఠశాల దశలో పిల్లలకు మంచి అలవాట్లతో ఆనందంగా జీవించే అలవాటును నేర్పించాలి. ప్రభుత్వ విధాన నిర్ణయాలు కూడా సంతోషానికి స్థానం కల్పించాలి. ఇవి ప్రజలను సాధికారత వైపు నడిపిస్తూ, సామాజిక ఉన్నతిని పెంపొందించే విధంగా ఉండాలి. కుల,మత ఆదిపత్యం అంతమొందించాలి. రాజ్యాంగ సమానత్వం పునర్జీవింపచేయాలి. అప్పుడే ప్రజల మధ్య సామరస్యం పెరిగి సంతోషానికి బీజాలు పడతాయి. చివరగా సంతోషంగా ఉంటే పోయేదేమీ లేదు... బాధ తప్ప! అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

ఇంధన భద్రతలో భారత్ వెనకడుగు!?

భారతదేశ ఇంధన రంగంలో వంట గ్యాస్ (ద్రవీకృత పెట్రోలియం వాయువు) నేడు ఒక విడదీయలేని భాగంగా మారింది. ముఖ్యంగా 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' వంటి ప్రతిష్ఠాత్మక పథకాల ద్వారా దేశవ్యాప్తంగా పది కోట్లకు పైగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు అందాయి. నేడు దేశవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు వినియోగించబడుతున్నాయి, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గృహ వినియోగదారుల సమూహాల్లో ఒకటి. అయితే, వెలుగుతున్న ఈ పొయ్యిల వెనుక ఒక భయంకరమైన సత్యం దాగి ఉంది. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న గ్యాస్ కొరత మరియు సరఫరాలో తలెత్తుతున్న ఆటంకాలు మన దేశ 'ఇంధన భద్రత' (Energy Security) లోని ఘోరమైన లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. ప్రభుత్వం దీనిని "ఆందోళనకరమైన పరిస్థితి"గా గుర్తించి, బుకింగ్ పద్ధతులను కఠినతరం చేయడం మరియు అత్యవసర వస్తువుల చట్టాన్ని అమలు చేయడం వంటి తక్షణ చర్యలకు ఉపక్రమించడం మన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం పడుతోంది.

వెంక గారి భూమయ్య
9848559863

మన దేశానికి అవసరమైన వంట గ్యాస్‌లో 60 శాతానికి పైగా కేవలం దిగుమతుల ద్వారానే వస్తోంది. అందులోనూ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ దిగుమతుల్లో 90 శాతం ఒక్క మధ్య ప్రాచ్య దేశాల నుంచే వస్తున్నాయి. భౌగోళిక రాజకీయంగా ఎప్పుడూ ఉద్రిక్తతలు నెలకొనే 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' వంటి వివాదాస్పద జలమార్గాల ద్వారా ఈ సరఫరా జరుగుతుండటం భారత్‌కు పెద్ద సవాలు. అంతర్జాతీయంగా ఏ చిన్న యుద్ధ మేఘాలు కమ్మినా లేదా ఆ సముద్ర మార్గంలో నౌకల రాకపోకలకు ఆటంకం కలిగినా, మన దేశంలోని కోట్ల మంది ఇళ్లలో వంట నిలిచిపోయే ప్రమాదం ఉంది. మనం ఇంధన ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించకుండా, కేవలం ఒకే ప్రాంతంపై, అది కూడా అస్థిరమైన రాజకీయ పరిస్థితులు ఉన్న దేశాలపై ఆధారపడటం అనేది పాలకుల దూరదృష్టి లేమికి నిదర్శనమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, దేశ సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశం.

వ్యూహాత్మక నిల్వ కేంద్రాల లేమి.. 15 రోజుల నిల్వతో దేశం భద్రమేనా?

చమురు నిల్వలకు (Strategic Petroleum Reserves) ఉన్నట్లుగా, వంట గ్యాస్ కోసం మన దేశంలో ఎటువంటి 'వ్యూహాత్మక నిల్వ కేంద్రాలు' లేకపోవడం అత్యంత విచారకరం. ప్రస్తుతం ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల వద్ద ఉన్న నిల్వలు కలిపినా కేవలం 15 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయి. అంటే, ఏవైనా కారణాల వల్ల దిగుమతులు నిలిచిపోతే, కేవలం రెండు వారాల్లోనే దేశం మొత్తం అంధకారంలోకి లేదా ఆకలి చావుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. యుద్ధం వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఈ నిల్వలు ఏమాత్రం చాలవు. ఒక పటిష్టమైన ఇంధన భద్రతా ప్రణాళికలో భాగంగా కనీసం 45 రోజుల అవసరాలకు సరిపడా భూగర్భ లేదా ఉపరితల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఉంది. దీనికోసం వేల కోట్ల పెట్టుబడి అవసరమైనప్పటికీ, దేశ ప్రజల ప్రాథమిక అవసరాల ముందు ఇది చాలా స్వల్పం. ఒక్క రోజు నిల్వ సామర్థ్యం పెంచుకోవడానికి సుమారు రూ. 2,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా, కానీ భవిష్యత్తులో వచ్చే సంక్షోభాల ఆర్థిక నష్టం దీనికంటే వేల రెట్లు ఎక్కువగా ఉంటుంది.

సరఫరా మార్గాలను విస్తరించుకోవాలి, ప్రత్యామ్నాయం ఎక్కడ?

కేవలం మధ్య ప్రాచ్యంపైనే కాకుండా, ప్రపంచంలోనే గ్యాస్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న అమెరికా వంటి దేశాల నుండి దిగుమతులను పెంచుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. అమెరికా నుండి రావడానికి నౌకలకు సుమారు 45 రోజుల సమయం పట్టినప్పటికీ, వివిధ దేశాల నుండి సరఫరా మార్గాలను కలిగి ఉండటం వల్ల (Diversifying Sourcing) ఏదైనా

ఒక ప్రాంతంలో సంక్షోభం తలెత్తినా మన దేశీయ అవసరాలకు ఆటంకం కలగదు. మన రిఫైనరీలు అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉన్నప్పటికీ, ముడి చమురు నుండి వచ్చే గ్యాస్ ఉత్పత్తి కేవలం 35 శాతానికి మించడం లేదు. అందుకే దేశీయంగా సహజ వాయువు ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారించాలి.

శాశ్వత పరిష్కారం..స్వదేశీ వనరులే శరణ్యం

గ్యాస్ కొరతను అధిగమించాలంటే కేవలం దిగుమతులపై దృష్టి పెడితే సరిపోదు. మన దేశంలో లభ్యమయ్యే సహజ వాయువు (Natural Gas) వినియోగాన్ని గృహ అవసరాలకు మళ్లించాలి. ముంబై తీరం, కృష్ణాగోదావరి బేసిన్, రాజస్థాన్ వంటి ప్రాంతాల నుండి వస్తున్న గ్యాస్‌ను పైపుల ద్వారా నేరుగా ఇళ్లకు చేరవేయాలి (PNG). దీనివల్ల సిలిండర్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, గ్యాస్ వృధాను అరికట్టవచ్చు. వీటికి తోడు, భవిష్యత్తులో ఇంధన స్వయం సమృద్ధి సాధించడానికి 'విద్యుత్ పొయ్యిల' (Electric Cooking) వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. ఇది ప్రస్తుతం కొంచెం ఖరీదైనదిగా అనిపించినా, విదేశీ గ్యాస్‌పై ఆధారపడకుండా ఉండటానికి ఇదొక్కటే శాశ్వత మార్గం. సోలార్ విద్యుత్ ద్వారా ఈ పొయ్యిలను నడిపించేలా సాంకేతికతను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలి.

మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది!

"గోతిలో పడ్డ ఆవును బయటకు తీయడమే కాదు, అది మళ్ళీ గోతిలో పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే సరైన నిర్వహణ" అన్న మేనేజ్‌మెంట్ పాఠం మన పాలకులకు తెలియంది కాదు. ప్రభుత్వం కేవలం తాత్కాలికంగా బుకింగ్‌లను నియంత్రించడంతో లేదా చట్టాలను కఠినతరం చేయడంతో సరిపెట్టకూడదు. ఇది కేవలం ఒక పూట సమస్య కాదు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పటిష్టమైన ఇంధన విధానాన్ని రూపొందించి, నిల్వ సామర్థ్యాన్ని యుద్ధ ప్రాతిపదికన పెంచుకోవాలి. వంట గ్యాస్ రవాణాలో వాడే నౌకలకు రక్షణ కల్పించడం నుండి, కొత్త మార్గాలను అన్వేషించడం వరకు ప్రతి అడుగు ఆచితూచి వేయాలి. అప్పుడే పది కోట్ల భారతీయ కుటుంబాల వంటగది భద్రంగా ఉంటుంది. పాలకుల అజాగ్రత్త ఇలాగే కొనసాగితే, రేపు దేశం మొత్తం తీరని ఇంధన సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. దేశ ప్రజల ఆకలిని తీర్చే పొయ్యిలు ఆరిపోకముందే మేల్కొనడం అత్యవసరం!

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్)

మానవ హితమే 'ఈద్' అభిమతం

యండి. ఉబైద్ ఖాన్
6305414351

రమజాన్ నెల ముగిసిన తర్వాత ముస్లిం సమాజం అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకునే పర్వదినం ఈదుల్ ఫిత్ర్. ఏకధాటిగా నెలరోజులపాటు సాగిన ఆధ్యాత్మిక సాధన స్ఫూర్తితో, మానవీయ విలువలకు నూతన ఆరంభం. ఉపవాసం ద్వారా శరీరాన్ని మాత్రమే కాదు, తన ఆలోచనలను, ప్రవర్తనను కూడా శుద్ధి చేసుకున్న మనిషి ఆ అనుభూతిని సమాజంతో పంచుకునే రోజు ఈద్. అందుకే ఈ పండుగలో కనిపించే ఆనందం కేవలం ఉత్సవపు ఉల్లాసం కాదు; అది ఆధ్యాత్మికత, దానం, సహోదరత్వం, సామాజిక బాధ్యతల సమ్మేళనం. ఇస్లాం ధర్మంలో రమజాన్ నెలకు అత్యంత ప్రత్యేక స్థానం ఉంది. ఈ నెలలోనే పవిత్ర ఖుర్‌ఆన్ అవతరించింది. అందుకే ఈ నెలను ఆధ్యాత్మికంగా అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం పాటించడం, రాత్రిళ్లు ప్రత్యేక ప్రార్థనలు చేయడం, ఖుర్‌ఆన్ పఠనం, దానం వంటి ఆచారాలు విశ్వాసుల జీవితంలో ఒక శుద్ధి ప్రక్రియలా మారుతాయి. ఉపవాసం ద్వారా ఆకలి, దాహం అనుభూతిని స్వచ్ఛందంగా స్వీకరించడం ద్వారా మనిషి తన కోరికలను నియంత్రించుకోవడం నేర్చుకుంటాడు. అదే సమయంలో పేదసాదల కష్టాలను అర్థం చేసుకునే సానుభూతి కూడా అతనిలో పెరుగుతుంది. ఈ ఆధ్యాత్మిక శిక్షణకు ప్రతిఫలంగా వచ్చే ఆనందోత్సవమే ఈదుల్ ఫిత్ర్. ఒక నెలపాటు ఉపవాసం పాటించిన తర్వాత అందరూ కలిసి ప్రార్థన చేసి, పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందాన్ని పంచుకుంటారు. కానీ ఈ ఆనందం వెనుక ఉన్న భావం చాలా విశాలమైనది. మన జీవితంలో సంపద, అధికారాలు, కీర్తి ఎంత ఉన్నా నిజమైన సంతోషం పంచుకోవడంలోనే ఉందని ఈద్ మనకు గుర్తు చేస్తుంది. ఈ పండుగలోని ముఖ్యమైన ఆచారాల్లో ఒకటి జకాతుల్ ఫిత్ర్ లేదా ఫిత్రా. ప్రతి ముస్లిం కుటుంబం తమ శక్తికి తగ్గట్టు పేదలకు దానం చేయడం సంప్రదాయం. దీని వెనుక ఉన్న భావం ఎంతో గొప్పది. సమాజంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే మానవీయ బాధ్యతను ఇది గుర్తు చేస్తుంది. పండుగ ఆనందం సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరాలనే భావన ఇస్లాం లోని సామాజిక న్యాయ భావనను ప్రతిబింబిస్తుంది.

ఈద్ రోజు ఉదయం మసీదులు, ఈద్ గాహ్‌లలో జరిగే ప్రత్యేక ప్రార్థనలు సమాజంలోని ఐక్యతను ప్రతిబింబిస్తాయి. వేలాది మంది ఒకే స్థలంలో చేరి, ధనిక, పేద, పెద్ద, చిన్న అనే తేడాలు లేకుండా ఒకే వరుసలో నిలబడి ప్రా



ర్థన చేయడం సమానత్వానికి ప్రతీక. ప్రార్థన అనంతరం ప్రజలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని 'ఈద్ ముబారక్' అని శుభాకాంక్షలు తెలుపుకోవడం పరస్పర ప్రేమను, క్షమాభావాన్ని వ్యక్తపరుస్తుంది.

ఈదుల్ ఫిత్ర్ పండుగ తాత్వికంగా కూడా ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. రమజాన్ నెలలో మనిషి తనలోని స్వార్థాన్ని తగ్గించి దయ, సహనం, నియంత్రణ వంటి విలువలను పెంపొందించుకుంటాడు. ఈ విలువలు కేవలం ఒక నెలకు మాత్రమే పరిమితం కాకుండా జీవితాంతం కొనసాగాలని ఈద్ మనకు గుర్తు చేస్తుంది. నిజమైన ఈద్ అంటే కేవలం ఒక రోజు సంబరం కాదు; రమజాన్ ద్వారా పొందిన ఆధ్యాత్మిక మార్పును జీవితంలో నిలబెట్టుకోవడం. సామాజికంగా కూడా ఈ పండుగ గొప్ప ప్రాముఖ్యతను కలిగి ఉంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకోవడం ద్వారా బంధాలు మరింత బలపడతాయి. చాలా సందర్భాల్లో సంవత్సరాలుగా కొనసాగుతున్న అపార్థాలు, విభేదాలు కూడా ఈ సందర్భంలో పరిష్కారమవుతాయి. పరస్పరం క్షమించుకోవడం, మళ్లీ దగ్గరవడం ఈ పండుగకు ప్రత్యేకమైన లక్షణం. భారతదేశం వంటి బహుళ మతాలు, భిన్న సంస్కృతులు కలిసిన దేశంలో ఈదుల్ ఫిత్ర్ పండుగకు ప్రత్యేకమైన సామాజిక అర్థం ఉంది. ముస్లింలు మాత్రమే కాకుండా ఇతర మతాల ప్రజలు కూడా తమ ముస్లిం స్నేహితులతో కలిసి ఈద్ ఆనందాన్ని పంచుకోవడం భారతీయ సమాజంలోని సహజ సామరస్యాన్ని ప్రతిబింబిస్తుంది. పండుగల ద్వారా ఏర్పడే ఈ పరస్పర బంధాలు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయి. ప్రపంచం ఈరోజు అనేక విభజనలు, అసహనం, ద్వేషరాజకీయాలను ఎదుర్కొంటున్న సమయంలో ఈదుల్ ఫిత్ర్ ఇచ్చే సందేశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మతం, జాతి, భాష పేరుతో మనుషుల మధ్య అడ్డుగోడలు పెరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో క్షమాభావం, దయ, సహానుభూతి, పరస్పర గౌరవం వంటి విలువలు ఎంత అవసరమో ఈ పండుగ మళ్లీ గుర్తు చేస్తుంది. రమజాన్ నెల మనిషికి ఒక ఆత్మపరిశీలన సమయం. తన జీవితంలోకి ఒకసారి తొంగి చూసుకుని, తన లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేసే కాలం. ఈద్ ఆ ప్రయాణానికి ఒక ఆనందకర ముగింపు. అదే సమయంలో ఒక కొత్త సంకల్పానికి ఆరంభం కూడా.

ఈదుల్ ఫిత్ర్ పండుగ కేవలం ముస్లిం సమాజానికి మాత్రమే చెందిన పండుగ కాదు; అది మానవత్వానికి సంబంధించిన పండుగ. ఉపవాసం ద్వారా నేర్చుకున్న నియంత్రణ, దానం ద్వారా పెరిగిన దయా గుణం, ప్రార్థన ద్వారా పొందిన ఆధ్యాత్మిక బలం - ఇవన్నీ కలిసి సమాజంలో ప్రేమ, న్యాయం, సామరస్యం స్థాపించడానికి మార్గం చూపుతాయి. అందుకే ఈ పండుగ మనకిచ్చే అసలు సందేశం ఎంతో సరళం, కానీ చాలా గొప్పది. నిజమైన ఈద్ కొత్త బట్టలు ధరించడంలో కాదు; కొత్త మనసుతో జీవించడంలో ఉంది. ద్వేషం స్థానంలో ప్రేమను, స్వార్థం స్థానంలో దానాన్ని, విభేదాల స్థానంలో ఐక్యతను పెంపొందించడమే ఈదుల్ ఫిత్ర్ అసలు ఆత్మ. ఈ ఆత్మను మన జీవితంలో నిలబెట్టగలిగితేనే ఈ పండుగ ఆధ్యాత్మిక, తాత్విక, సామాజిక సందేశం సార్థకమవుతుంది. దైవం మనందరికీ ఈ పర్వదినం స్ఫూర్తిని అందిపుచ్చుకొనే అవకాశం అనుగ్రహించాలని కోరుకుందాం.

(వ్యాస రచయిత జర్నలిజం విద్యార్థి)

ఆత్మ ప్రక్షాళన నుండి సామాజిక పరివర్తన వరకు

రమజాన్ నేర్పిన జీవన పాఠం

ముహమ్మద్ ముజాహిద్
9640622076

నగరమంతా ఈద్ కోలాహలం కనిపిస్తోంది. కొత్త బట్టలు, అత్తరు పరిమళాలు, సేమియా పాయసం తీపిదనం గాలిలో పలకరిస్తున్నాయి. కానీ, ఈ బాహ్య సంబరాల వెనుక ఒక నిశబ్ద విప్లవం దాగి ఉంది. అది గత ముప్పై రోజులుగా ప్రతి విశ్వాసి గుండెలో జరిగిన 'ఆత్మ ప్రక్షాళన' విప్లవం.

ఆకలి నేర్పిన పాఠం

రమజాన్ అంటే కేవలం సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఆహార పానీయాలకు దూరంగా ఉండటం మాత్రమే కాదు. అది ఒక "ఆధ్యాత్మిక రీబూట్" (Spiritual Reboot). ఎర్రటి ఎండలో గొంతు ఎండుతున్నప్పుడు కలిగే ఆ వేదన, లోకంలో ఆకలితో అలమటించే కోట్లాది మంది అభాగ్యుల బాధను మనకు రుచి చూపిస్తుంది. "రోజా" అనేది కేవలం కడుపుకు చేసే నియమం కాదు, అది కళ్లకు, మాటలకు, ఆలోచనలకు విధించుకునే ఒక క్రమశిక్షణ. మనలోని అహాన్ని కరిగించి, వినయాన్ని నింపే ఒక అద్భుత ప్రక్రియ.

ఖుర్‌ఆన్: చీకటిలో వెలిగే దివ్వె

ఈ నెలలో ప్రతి ఇంటా వినిపించే ఖుర్‌ఆన్ పఠనం కేవలం ఒక ఆచారం కాదు. అది జీవిత గమ్యాన్ని నిర్దేశించే ఒక మ్యాప్. న్యాయం, దయ, సత్యం అనే మూడు స్తంభాల మీద మనిషి జీవితం ఎలా నిర్మితం కావాలి అన్నది ఖుర్‌ఆన్ ప్రతి పేజీలోనూ ప్రతిధ్వనిస్తుంది. రమజాన్‌లో మనం చదివిన ఆ వాక్యాలు, కేవలం చదవడానికే పరిమితం కాకుండా, మన ప్రవర్తనలో ప్రతిబింబించినప్పుడే ఆ పఠనానికి సార్థకత లభిస్తుంది.

ఈద్: బాధ్యతతో కూడిన ఆనందం

నెలవంక కనిపించగానే మొదలయ్యే ఈద్ సంబరం, ఒక పరుగు పందెం ముగిసిన తర్వాత వచ్చే విశ్రాంతి వంటిది. అయితే, ఈ ఆనందం స్వార్థపూరితమైనది కాదు. "ఫిత్రా" (దానం) ఇవ్వనిదే ఈద్ నమాజ్ పూర్తి కాదు అన్న నిబంధన వెనుక ఒక గొప్ప సామాజిక కోణం ఉంది. "నేను నవ్వుతున్నప్పుడు, నా పక్కవాడు ఆకలితో ఉండకూడదు" అనే కరుణే ఇస్లాం యొక్క అసలు ఆత్మ. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధించినట్లుగా—మనకు ఇష్టమైన వస్తువును ఇతరులకు పంచినప్పుడే మన విశ్వాసం పరిపూర్ణమవుతుంది.

వ్యక్తి నుండి సమాజం వైపు..

ఒక వ్యక్తి తన కోపాన్ని అదుపులో ఉంచుకోవడం నేర్చుకుంటే, ఆ ప్రభావం కుటుంబం మీద పడుతుంది. ఒక కుటుంబం నిజాయితీగా ఉంటే, అది సమాజంలో మార్పుకు పునాది వేస్తుంది. రమజాన్ నేర్పిన క్రమశిక్షణ కేవలం మసీదు గోడల మధ్య ఉండకూడదు. అది ఆఫీసులో మనం చూపే నిజాయితీలో, రోడ్డు మీద మనం పాటించే ఓపికలో, కష్టాల్లో ఉన్న సోదరుల పట్ల

మనం చూపే సానుభూతిలో కనిపించాలి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, పేదరికంతో నలిగిపోతున్న 'ఉమ్మత్' (సమాజం) బాధను మన బాధగా భావించడమే అసలైన సోదరభావం.

ముగింపు: మార్పు శాశ్వతమా?

ఈద్ ముగిసిన తర్వాత మనం మళ్లీ పాత అలవాట్లలోకి జారిపోతే, రమజాన్ కేవలం ఒక క్యాలెండర్ ఈవెంట్‌గా మిగిలిపోతుంది. కానీ, ఆ ముప్పై రోజుల సాధనను ఏడాది పొడవునా కొనసాగించడమే "ఇస్తికామత్" (స్థిరత్వం). నిజమైన ఈద్ అంటే కొత్త బట్టలు ధరించడం కాదు, కొత్త వ్యక్తిత్వాన్ని ధరించడం. మనలోని స్వార్థం చనిపోయి, పరోపకారం జన్మించిన రోజే అసలైన ఈద్. పండుగ ముగిసినా, ఆ పవిత్రత మన గుండెల్లో నిలిచి ఉండాలి.

చివరగా ఒకే ప్రశ్న: "ఈ రమజాన్ మనల్ని మార్చిందా? లేక మనం కేవలం క్యాలెండర్ పేజీలను మాత్రమే మార్చామా?" ఈ ప్రశ్నకు మన ప్రవర్తనే సమాధానం కావాలి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 21.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 1 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

పాఠకులు, ప్రకటనకర్తలు, మిత్రులు శ్రేయోభిలాషులకు రంజాన్ శుభాకాంక్షలు

ఈద్ ముబారక్

₹3,24,234 కోట్ల భారీ బడ్జెట్

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క
- కొత్తగా 2 లక్షల చేయూత పెన్షన్లు
- విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం
- ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2వేల ఉపకార వేతనం
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కింద రూ.5లక్షలు
- ఆరు గ్యారంటీల అమలుకు భారీగా కేటాయింపులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వార్షిక బడ్జెట్లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తూ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 'గత ప్రభుత్వాల ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూ, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తాము గత పాలకుల్లా కాకుండా, ప్రజల సేవకుల్లా పని చేస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని సభకు వివరించారు. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను

...:: మిగతా 4లో

రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234

రెవెన్యూ వ్యయం	రూ.2,34,406 కోట్లు
మొత్తం రెవెన్యూ ఆదాయం	రూ.2,41,263 కోట్లు
రాష్ట్ర తలసరి ఆదాయం	రూ.4,18,931

తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి పెద్దపీట

- 2026-27 బడ్జెట్.. 'ఫ్యూచరిస్టిక్ బడ్జెట్'
- నర్సరీ నుంచి ఇంటర్ వరకూ ఒకే విద్యా విధానం
- విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నాం
- మూసీ ప్రాజెక్టు విషయంలో వెనుకాడేదే లేదు..
- ప్రతి కుటుంబానికి "ఇందిరా కుటుంబ జీవిత బీమా"
- అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్ గృహనిర్బంధం
- మీడియా ఇష్టాగోష్టి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

...:: 2లో

ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా.. కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 20: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాకా కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీస్తాం అని, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీకి బయల్దేరి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మి నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు.

అధికార మార్పుకు కేరళ సిద్ధం: రాహుల్

మరికొద్ది రోజుల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళ ప్రజలు అధికార మార్పునకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

9

ఇంటి పనులు దంపతులు సమానంగా చేసుకోవాలి: సుప్రీంకోర్టు

వండటం, క్లీనింగ్, బట్టలు ఉతకడం లాంటి ఇంటి పనుల్లో భార్యతో సమానంగా భర్త కూడా పాల్గొనాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

9

ఆ 9 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దు

డ్రోన్లు, క్షిపణుల దాడులతో పరిస్థితులు రోజురోజుకీ ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని భారత పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) కీలక అడ్వైజరీ జారీ చేసింది.

9

సీఎం రేవంత్ రైతులకు క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం మూడుసార్లు రైతుబంధు ఆపింది
- అందుకు ముఖ్యమంత్రి ముక్కు నేలకు రాయాలి
- రాష్ట్ర వార్షిక బడ్జెట్ మొత్తం అబద్ధాలే
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుబంధు ఆపిందని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి, రైతాంగానికి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలకు గత బడ్జెట్‌లో రూ.56 వేల కోట్లు కేటాయించారని, కానీ ఇప్పుడు దాన్ని రూ.50 వేల కోట్లకు తగ్గించారని చెప్పారు. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి, మహిళలకు నెలకు రూ.2,500.. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తారేమోనని తాము భావించామని అన్నారు. కానీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు కేటాయింపులు తగ్గించి అమలు చేస్తున్న పథకాలకు కూడా కోతపెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఇక జాతీయ తలసరి

...:: మిగతా 4లో

ఎస్ఎల్బీసీ తవ్వకాల పునరుద్ధరణ

- ఎస్ఎల్బీసీ తవ్వకాల పునరుద్ధరణ
- ఇకపై నిరంతరాయంగా పనులు
- అదనపు భద్రతా చర్యలు.. పకడ్బందీగా తవ్వకాలు
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 20: ప్రతిష్టాత్మక ఎస్ఎల్బీసీ ఇన్లెట్ తవ్వకాల పునరుద్ధరణ పనులు ప్రారంభం అయ్యాయని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే దేవరకొండ నుండి ఔట్లెట్ పనులు ప్రారంభం అయిన నేపథ్యంలో ఇప్పుడు ఇన్లెట్ పనులు కుడా ప్రారంభమయిన నేపథ్యంలో ఎస్ఎల్బీసీ తవ్వకాలు వేగవంతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ బీఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్ఎల్బీసీతో పాటు, డిండి ఎత్తిపోతల పథకం, అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ పురోగతిపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

...:: మిగతా 4లో

ఇది ఫేక్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్

- ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు మోపారు
- అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు
- బడ్జెట్లో ఉద్యమకారులను విస్మరించారు
- మోడీని బడే భాయ్ అని.. ఢిల్లీ నుంచి రూ. వంద కూడా తేలేదు
- కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేకుతున్నారు
- అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు, మైనార్టీల ఇలా అన్ని వర్గాలకు బడ్జెట్లో అన్యాయం చేశారని అన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. రైతుభరోసా, చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులనే అక్షరం మార్చకుండా అలాగే కొత్త బడ్జెట్ లోనూ పెట్టారని తెలిపారు. ఏటా బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేకారని.. కానీ బడ్జెట్ లో మాత్రం 4 శాతం నిధులే కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం మంది ఉన్న బీసీలకు 4 శాతం నిధులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు. లక్షల కోట్లు అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తుందని ప్రశ్నించారు. దాదాపు 8 లక్షల 64 వేల కోట్లు అప్పు చేసి ప్రతి ఒక్కరి తలపై రూ. 2 లక్షల 16 వేల భారం మోపారన్నారు. ఒక్కో కుటుంబంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.9 లక్షల అప్పుల భారం మోపిందన్నారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చినా ప్రజలకు మాత్రం పైసా మేలు జరగలేదన్నారు. మోడీ తన

...:: మిగతా 4లో

ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్

- కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడీ
- ఈ బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చలేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఈ బడ్జెట్‌ను "ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్"గా అభివర్ణించారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో గత ఏడాదితో పోలిస్తే పెద్దగా మార్పులు లేవని, గత బడ్జెట్‌నే మళ్లీ చదివినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చెప్పుకునే స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని పేర్కొన్న ఆయన, మొత్తం బడ్జెట్‌లో కేవలం 8 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమని అన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ప్రభుత్వం విద్యపై తక్కువ దృష్టి సారించిందని విమర్శించారు. ఆరోగ్య రంగంలోనూ ప్రభుత్వం విఫలమైందని, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో 'ఫ్యూచర్ సిటీ' వంటి పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్లే పెట్టుబడులు వస్తున్నాయని, నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర పథకాల ప్రభావమే

...:: మిగతా 4లో

అగార్కర్ పదవీ కాలం పొడగింపు

క్రికెట్ చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవి కాలం త్వరలోనే ముగియనుంది. దాంతో, అతడు తనను మరికొన్ని రోజులు కొనసాగించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలిని కోరినట్టు వార్తలు వస్తున్నాయి.

10

రాజకీయం

సభ సోమవారానికి వాయిదా

- చెవిలో పూలతో బీఆర్ఎస్ నిరసన, వాకౌట్
- బడ్జెట్ ప్రతులను చించడం బాధాకరం: దానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ శాసనసభ సోమవారానికి వాయిదా పడింది. శుక్రవారం సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు.

చెవిలో పూలతో బీఆర్ఎస్ నిరసన, వాకౌట్

కాగా... ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొనసాగుతుండగానే సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను చించివేశారు. బడ్జెట్ మొత్తం మోసం.. మోసమంటూ బీఆర్ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు.

బడ్జెట్ ప్రతులను చించడం బాధాకరం: దానం నాగేందర్

సభ నుంచి బీఆర్ఎస్ నేతల వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నీళ్లు కూడా తాగలేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం బడ్జెట్‌ను విమర్శిస్తూ చెవిలో పువ్వులు పెట్టుకొని వెళ్లిపోయారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు బడ్జెట్ ప్రతులను చించివేయడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్ పేదలు, బీసీ, ఎస్సీ, విద్యార్థులకు ఉపయోగకరమైనదన్నారు. పేదలు, విద్యార్థుల గురించి మాట్లాడే సమయంలోనే బీఆర్ఎస్ వాళ్లు వెళ్లిపోయారని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రైతులకు క్షమాపణ చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

ఆదాయంతో పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా ఉందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి విక్రమార్క చెప్పారని, కానీ బీఆర్ఎస్ హయాంలో తలసరి ఆదాయం అంతకంటే ఎక్కువగా ఉందని హరీష్‌రావు చెప్పారు.

బడ్జెట్‌లో మొత్తం అబద్దాలే..

రాష్ట్రంలో అవినీతి, అక్రమాల కారణంగా.. చేతగానీ పాలనవల్ల ఈసారి తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. ఈ ప్రభుత్వం ఫ్యూర్ మోడల్ అంటూ తెలంగాణను, హైదరాబాద్ నగరాన్ని మూడు ముక్కలు చేయాలని చూస్తోందని, ఇది ఫ్యూర్ మోడల్ కాదని, చోర్ మోడల్ గోల్‌మాల్ మోడల్ అని విమర్శించారు. బడ్జెట్‌లో మొత్తం అబద్దాలే ఉన్నాయని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణ అంశంలో ఇన్ని అబద్ధాలు చెప్పలేదని హరీష్‌రావు విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని అన్నారు. కనీసం జాబ్ క్యాలెండర్ గురించి ఏదైనా చెబుతారేమో అనుకుంటే అది కూడా లేదని మండిపడ్డారు.

ఎస్ఎల్బీసీ తవ్వకాల పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ రెండు వైపులా తవ్వకాలు ప్రారంభం అయినందున ఇకపై నిరంతరాయంగా పనులు కొనసాగుతాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగ నిలువనున్న ఈ ప్రాజెక్ట్ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిబంధనలు కఠినంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తవ్వకాల సమయంలో సొరంగ మార్గం చివరికంటూ గాలి వెలుతురు ప్రసారం అయ్యేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇన్లెట్ వైపు పనులు పునఃప్రారంభం కావడానికి ముందే 20 మీటర్ల దూరం ఓపెన్ కట్ చేయడంతో పాటు అదనపు భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే తవ్వకాలు ప్రారంభించిన ఔట్ లెట్ తవ్వకాలలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి 20 మీటర్ల దూరం పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఏడూ సంవత్సరాలుగా ఔట్ లెట్ పనులు నిలిచి పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ 43.93 కిలోమీటర్ల పొడవైన ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం శ్రీశైలం ఎడమ కాలువ భాగం నుండి మొదలు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇది పూర్తి అయితే ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగా ఇది నిలిచి పోతుందన్నారు. అయితే 2025 ఫిబ్రవరిలో దురదృష్టవశాత్తు జరిగిన ఘటనతో పనులు నిలిచి పోయాయన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ఎస్ఎల్బీసీ పనుల పునరుద్ధరణకు ఉన్నత స్థాయి కమిటీ నియమించి, కమిటీ సిఫార్సుల మేరకు పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు

ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర అభివృద్ధికి కారణమని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, రైతు భరోసా చెల్లింపుల్లో భారీ బకాయిలు ఉన్నాయని విమర్శించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం వంటి హామీలు బడ్జెట్‌లో కనిపించడం లేదన్నారు.మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూలగొడుతున్నారని, ప్రాజెక్ట్ వ్యయం పెరగడం వెనుక అవినీతి ఉందని ఆరోపించారు. దేవాలయాల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని, అర్చకుల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ ప్రజల ఆశలను నెరవేర్చలేదని, పేదలకు దూరంగా ఉందని పేర్కొంటూ బీజేపీ ఈ బడ్జెట్‌ను తీవ్రంగా ఖండిస్తోందని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

ఇది ఫేక్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

బడే భాయ్ అంటూ ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా ఎందుకు తేలేదో చెప్పాలని నిలదీశారు. ప్రజలకు మేలు చేయటం చేతకాని కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్‌తున్నారని మండిపడ్డారు. అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని కవిత విమర్శించారు.

రాహుల్ ఫేక్.. హామీలపై నిలదీస్తాం

ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఇచ్చిన హామీలన్నీ కూడా ఫేకే అన్నారు. హైదరాబాద్ లో సలీం ఫేక్ అనే నటుడి మాదిరిగానే రాహుల్ గాంధీ కూడా ఫేక్ మాటలు చెబుతుంటాడని విమర్శించారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి రాహుల్ ఫేక్‌గా నామకరణం చేస్తున్నామన్నారు. సలీం ఫేక్ తన మాటలతో నవ్విస్తే...రాహుల్ గాంధీ మాత్రం తెలంగాణ ప్రజలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు ఎప్పుడు వచ్చిన సరే ఆయన ఇచ్చిన హామీలపై నిలదీస్తామన్నారు.

నిరుద్యోగంలో రైజింగ్..

బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళలకు రూ.2,500 స్కీం ఈసారి కూడా పత్తా లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.7 వేల కోట్లు కోత పెట్టారని అన్నారు. సింగరేణి, ట్రాన్స్, జెన్ కో లకు ఇవ్వాల్సిన 1.50 లక్షల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి కేటాయింపులు లేవని, ఉద్యోగులు, పెన్షనర్లకు బడ్జెట్ లో ఎలాంటి కొత్త కేటాయింపులు లేవన్నారు. కమీషన్లు వచ్చే యంగ్ ఇండియా స్కూళ్లకు మాత్రం రూ.5 వేల కోట్లు కేటాయించారని, కానీ టీచర్ల రిక్రూట్ మెంట్ లేకుండా స్కూల్స్ నిర్మించి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. వరల్డ్ బ్యాంక్ ను మన భూములు ధారాదత్తం చేసే మూసీ ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని అన్నారు. 3.24 లక్షల కోట్ల బడ్జెట్ లో క్యాపిటల్ ఎక్స్ పెండిచర్ కేవలం రూ.50 వేల కోట్లలోపేనని ఇలాగైనా సంపద సృష్టి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అన్నింటికి మించిన ఫేక్ అన్నారు. తెలంగాణ రైజింగ్ అంటూ ముఖ్యమంత్రి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారని కానీ నిరుద్యోగంలో మనం రైజింగ్ అవుతున్నామని కవిత చెప్పారు. స్టేట్ ఆఫ్ వర్కింగ్ అనే సర్వే సంస్థ చేసిన సర్వేలో తెలంగాణలో పెద్ద ఎత్తున నిరుద్యోగం ఉందని తేలిందని చెప్పారు. మహిళల విషయంలో 50 శాతం నిరుద్యోగిత రేటు ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. స్త్రీ నిధి విభాగంలో 14 ఏళ్లుగా ఓ దయ్యం ఉందని కవిత అన్నారు. జి. విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి గత బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలను మేనేజ్ చేసి ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. అతను చేసే అక్రమాలపై విచారణ కమిషన్ వేసినప్పటికీ ఇప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే మంత్రి సీతక్క ఎంక్వైరీ చేయించి విద్యాసాగర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు.

యంగ్ స్కిల్స్ యూనివర్సిటీ గురించి బడ్జెట్ లో గొప్పలకు పోయారని.. ఆ సంస్థ వెబ్ సైట్ లో 64 వేల మంది ఎన్ రోల్ చేసుకున్నట్టుగా ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని, వాస్తవానికి స్కిల్ యూనివర్సిటీలో ఎన్ రోల్ చేసుకున్నది 960 మంది మాత్రమేనని అన్నారు. వెంటనే యూనివర్సిటీ వెబ్ సైట్ లోని తప్పుడు సమాచారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. కేవలం 13 వేల ఉద్యోగాలు భర్తీ చేసి 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తాము ప్రజా బడ్జెట్ లో లేవనెత్తిన కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు ఈ బడ్జెట్ లో ప్రతిఫలించలేదన్నారు. మైనార్టీలు, దివ్యాంగుల సంక్షేమానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ లో కేటాయింపులు చేయకున్నా, రివైజ్డ్ ఎస్టిమేట్స్ లో అవకాశం దక్కని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వచ్చని.. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు.

ఇరాన్ – ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం మరి కొన్నాళ్లు కొనసాగితే ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉంది. ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలి.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

₹3,24,234 కోట్ల భారీ బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ బడ్జెట్ అటు సంక్షేమానికి, ఇటు అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ రూపొందించామని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు గతంలో కంటే మెరుగైన కేటాయింపులు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

తెలంగాణ ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం తీసుకువస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ పథకం వల్ల రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఈ పథకాన్ని జూన్ 2 నుంచి అమలు చేస్తామని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల మేర ఈ బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు.

ప్రజా క్షేమం.. సామాజిక న్యాయం

సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బడ్జెట్‌లో 'ప్రజా క్షేమం.. సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలోని ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు అందరికి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తామని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకుని వస్తున్నామన్నారు. ఈ పథకాలను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు వివరించారు. దివ్యాంగ, శారీరక వైకల్య విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ చేస్తామని తెలిపారు. సంక్షేమ స్కూళ్లలో వసతుల మెరుగుకు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించారు. అలాగే స్కిల్ యూనివర్సిటీని విద్యా శాఖ పరిధిలోకి తీసుకు వస్తున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

ఆరు గ్యారంటీలకు రూ.50,713 కోట్లు

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్లో సంక్షేమానికి పెద్దపీట వేసింది. దీనిలో భాగంగా ఆరు గ్యారంటీలకు రూ. 50,713 కోట్లను కేటాయించింది. ఈసారి పద్దులో రైతు భరోసాకు రూ. 18 వేల కోట్లను కేటాయించింది. దీనికి సంబంధించిన పూర్తి అంశాలపై అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు

దేశానికి అన్నం పెడుతున్న రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తమ ప్రభుత్వం భావిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో వ్యవసాయ దిగుబడులలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. రైతులకు పెట్టుబడి సహాయం కోసం ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ.6,000 చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ.12,000 సహాయం అందిస్తున్నామని అన్నారు. ఈ బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5,500 కోట్లు

ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండడం వారి ఆత్మ గౌరవానికి చిహ్నంగా ఉంటుంది. దీనిని గుర్తించిన ప్రభుత్వం "ఇందిరమ్మ ఇళ్లు" అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వం 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5,500 కోట్లు కేటాయిస్తామన్నారు.

మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పరచిన మొదటి వాగ్దానం ఉచిత బస్సు ప్రయాణమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిరోజు రాష్ట్రంలోని 34 లక్షల 37 వేల మంది ఆడబిడ్డలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 269 కోట్ల 68 లక్షల ఉచిత ప్రయాణాలు చేసి, దాదాపు రూ.9,222 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు

గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్ కామ్ ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్, యూకే, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా "సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం" ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు.

చేయూతలో నూతన పెన్షన్లు

చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. నేటి బడ్జెట్‌లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

బడ్జెట్ స్వరూపం (రూ.కోట్లలో..)

మొత్తం బడ్జెట్	3,24,234
మూలధన వ్యయం	47,267
మొత్తం రెవెన్యూ ఆదాయం	2,41,263
రాష్ట్ర పన్ను ఆదాయం	1,48,185
పన్నేతర ఆదాయం	35,730
గ్రాంట్లు	24,166
మొత్తం మూలధన ఆదాయం	82,870
బహిరంగ మార్కెట్ రుణాలు	73,383
కేంద్ర ప్రభుత్వ రుణాలు	5,500
ఇతర రుణాలు	1,000
లోన్లు, అడ్వాన్సులు	1,486
రెవెన్యూ వ్యయం	2,34,406
మూలధన వ్యయం	47,267
రుణాలపై వడ్డీ చెల్లింపులు	21,304
రాష్ట్ర తలసరి ఆదాయం	4,18,931

శాఖల వారీగా కేటాయింపులు

విద్యాశాఖ	రూ. 26,674 కోట్లు
వైద్యశాఖ	రూ. 13,679 కోట్లు
వ్యవసాయశాఖ	రూ.23,179 కోట్లు
విద్యుత్ శాఖ	రూ. 21,285 కోట్లు
పౌరసరఫరాలశాఖ	రూ.7,366 కోట్లు
పశుసంవర్ధకశాఖ	రూ.1,529 కోట్లు
కార్మికశాఖ	రూ.998 కోట్లు
మహిళ, శిశు సంక్షేమం	రూ. 3,143 కోట్లు
పర్యాటక రంగం	రూ.1,224 కోట్లు
ఎస్సీ సంక్షేమం	రూ.11,784 కోట్లు
ఎస్టీ సంక్షేమం	రూ.7,934 కోట్లు
బీసీ సంక్షేమం	రూ.12,511 కోట్లు
మైనార్టీ సంక్షేమం	రూ.3,769 కోట్లు
రాజీవ్ యువవికాసం	రూ.6 వేల కోట్లు
గృహ నిర్మాణం	రూ.7,430 కోట్లు
ఐటీ శాఖ	రూ.875 కోట్లు
పరిశ్రమలు	రూ.3,490 కోట్లు
పంచాయతీరాజ్	రూ.33,688 కోట్లు
నీటిపారుదల శాఖ	రూ. 22,615 కోట్లు
రవాణా , ఆర్ అండ్ బీ	రూ.12,789 కోట్లు
న్యాయ శాఖ	రూ.2,367 కోట్లు
పురపాలకశాఖ	రూ.17,907 కోట్లు
హోంశాఖ	రూ.11,907 కోట్లు
గోదావరి పుష్కరాలు	రూ.500 కోట్లు

తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి పెద్దపీట

- మీడియా ఇష్టాగోష్టి సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ భవిష్యత్తుకే మైలురాయి వంటిదని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్‌లో పెద్ద పీట వేశామని, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన 2026-27 బడ్జెట్‌ను "ఫ్యూచరిస్టిక్ బడ్జెట్"గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అసెంబ్లీలో బడ్జెట్ సమర్పణ అనంతరం మీడియా ప్రతినిధుల ఇష్టాగోష్టి సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇచ్చిన ఈ బడ్జెట్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు తెలిపారు. "తెలంగాణ రైజింగ్ విజన్" లక్ష్యసాధనకు ఈ బడ్జెట్ బలమైన పునాదిని వేస్తుందని పేర్కొన్నారు. అన్ని రంగాలు, అన్ని వర్గాలకు సమానంగా నిధులు కేటాయించామని స్పష్టం చేశారు.

దేశంలోనే తొలిసారిగా జీవిత బీమా..

దేశంలోనే తొలిసారిగా ప్రతి కుటుంబానికి "ఇందిరా కుటుంబ జీవిత బీమా" పథకాన్ని ప్రవేశపెట్టామని సీఎం వెల్లడించారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షల బీమా పరిహారం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 1.15 కోట్ల కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. విద్యా రంగ సంస్కరణలు, ప్రజారోగ్య సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో మార్పులు తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ప్రీప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ విద్య అందించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం రూ.3.47 లక్షల కోట్లు అప్పు తీసుకోగా, అందులో గత ప్రభుత్వ అప్పులు, వడ్డీలకే రూ.3.30 లక్షల కోట్లు చెల్లించాల్సి వచ్చిందని వివరించారు.

విద్యావిధానంలో సమూల మార్పులు..

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర విద్యావిధానంలో మార్పులుంటాయని సీఎం చెప్పారు. ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు ఒకేచోట చదివేలా విద్యావిధానం ఉంటుందన్నారు. విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తెస్తున్నామని, వాటిపై కమిటీ అధ్యయనం చేస్తోందని తెలిపారు. విద్యావ్యవస్థలో మార్పులపై కమిషన్ నివేదికే ఫైనల్ కాదని చెప్పారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత విద్యావ్యవస్థలో మార్పులుంటాయని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు

మూసీ విషయంలో వెనుకాడేదే లేదు..

మూసీ పునరుజ్జీవం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులను మాత్రం ఆదుకుంటామని తెలిపారు. మూసీ అభివృద్ధికి అప్పులు ఇచ్చేందుకు ఏడీబీ సిద్ధంగా ఉందన్న ఆయన డీపీఆర్ సాంకేతిక నిపుణుల ద్వారానే తయారవుతోందని పేర్కొన్నారు. మూసీ డీపీఆర్ పూర్తయ్యాక నిధుల కోసం కేంద్రానికి దరఖాస్తు చేస్తామన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని కాకపోతే నిధులను రాష్ట్రప్రయోజనాలకు ఉపయోగించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాలేదు కానీ రూ.44 వేల కోట్ల అప్పు చెల్లించినట్లు చెప్పారు. ఆర్థిక వెసులుబాటు చూసుకొని గ్యారంటీలు అమలు చేస్తున్నామని హరీశ్, కేటీఆర్, కేసీఆర్‌కు ఏం చెప్పినా చెవుటోడి ముందు శంకం ఊదినట్లేనని ఎద్దేవా చేశారు.

ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధం...

అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారని, అందువల్లే ఆయన అసెంబ్లీకి రాలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిల్ట్ పాలసీ, టీడీఆర్ భూబదలాయింపుపై సవాలు విసిరానన్న సీఎం ఏ ఏజెన్సీతోనైనా విచారణకు సిద్ధమని కేటీఆర్, హరీశ్‌కు సవాల్ చేసినట్లు గుర్తుచేశారు. హిల్ట్ పాలసీ వల్ల రూ.5 లక్షల కోట్ల అవినీతి జరిగిందనడం సరికాదని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అందులో నుంచి రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకే చెల్లించామన్నారు. తాము తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే వాడుకున్నట్లు చెప్పారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు దుష్ప్రచారం

ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు 20 నెలలు అందుబాటులో లేరని ఆ కారణంగానే 20 నెలలు ఆలస్యమైందన్నారు. ప్రభాకర్‌రావు అందుబాటులోకి వచ్చాక విచారణ వేగంగా కొనసాగుతోందని, సుప్రీంకోర్టులో ఫోన్‌ట్యాపింగ్ కేసు ఇంకా విచారణకే రాలేదని స్పష్టం చేశారు. చక్రధర్‌గౌడ్ కేసు కొట్టేస్తే ఫోన్‌ట్యాపింగ్ కేసు కొట్టేసినట్లు ప్రచారం చేశారని మండిపడ్డారు.జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జీఎస్టీ వసూళ్లు గడిచిన రెండు నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయన్నారు.

ఆ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తాం..

ఫార్ములా ఈకార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు.

గ్యారంటీలపై ఓ ప్రణాళిక ఉంది..

ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3. 47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు సీఎం.

ఆ భూములు అమ్మితే లక్ష కోట్లు రావు..

ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్టులో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు.

దళిత, గిరిజన సంక్షేమానికి పెద్దపీట

- అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌తో దళిత విద్యార్థుల జీవితాల్లో ఉజ్వల భవిష్యత్తు
- ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ.19,721 కోట్లు
- దివ్యాంగుల వివాహాలకు 2 లక్షల నగదు ప్రోత్సాహకం
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20 : దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సాధికారతను కేంద్రబిందువుగా చేసుకుని రూపొందించిన 2026-27 రాష్ట్ర వార్షిక బడ్జెట్ దళిత, గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ప్రతిపాదించిన సామాజిక న్యాయం, సమాన అవకాశాల లక్ష్యాలను ప్రతి బింబించే బడ్జెట్ అని ఆయన అన్నారు. షెడ్యూల్డ్ కులాలకు రూ.11,784 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు రూ.7,935 కోట్లు కలిపి మొత్తం రూ.19,721 కోట్ల భారీ కేటాయింపులు చేయడం ద్వారా అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఆధునిక సదుపాయాలతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణం చేపడుతున్నామని, అలాగే కాచిగూడ మౌళి అడ్డ వద్ద బాబు జగ్జీవన్ రామ్ కళాశాల విద్యార్థి వసతి భవన్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో దళిత విద్యార్థులకు అత్యున్నత స్థాయి కోచింగ్ అందించి సివిల్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా దళిత సామాజిక మౌలిక వసతుల అభివృద్ధికి రూ.368 కోట్ల 27 లక్షల వ్యయంతో 910 ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, అంబేద్కర్ భవనాలు, విగ్రహాలు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. సంక్షేమంలో భాగంగా దివ్యాంగుల వివాహాలను ప్రోత్సహిస్తూ రూ.2 లక్షల నగదు కానుక అందించడం ప్రభుత్వం సామాజిక బాధ్యతను చాటుతున్నదని అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రూపకల్పన చేసి రూ.4,000 కోట్లు ప్రతిపాదించడం ఈ బడ్జెట్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. అలాగే చేయూత పథకం కింద అర్హులైన వారికి 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ రూ.14,861 కోట్లు కేటాయించడం ప్రజల జీవన భద్రతకు పెద్ద అడుగని తెలిపారు.

విద్యా రంగంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 1,500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు రూ.500 కోట్లు ప్రతిపాదించామని చెప్పారు. విద్యార్థుల పోషణ కోసం కొత్తగా అల్పాహారం పథకాన్ని ప్రవేశపెట్టి, వారానికి మూడు రోజులు పాలు, మిగతా రోజులు రాగి జావ అందించేందుకు రూ.800 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆరోగ్య రంగంలో 23.50 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం ప్రవేశపెట్టడం గొప్ప ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో అధిక వడ్డీతో తీసుకున్న రుణాలను పునర్వ్యవస్థీకరించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషించారని మంత్రి కొనియాడారు. "ఈ బడ్జెట్ కేవలం లెక్కల పత్రం కాదు.. ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమం కలగలిపిన అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు నడిపించే కార్యాచరణ ప్రణాళిక" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

క్రీడా ప్రోత్సాహకుడు సీఎం రేవంత్

- క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రేవంత్ సర్కార్
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి
- క్రీడలకు 500 బడ్జెట్ కేటాయింపు
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని, దానికి నిదర్శనంగా బడ్జెట్లో అత్యధిక కేటాయింపులు జరుగుతున్నాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్రీడాకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత లభిస్తోందని, పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో క్రీడలకు మొత్తం కలిపి 150 కోట్లు కేటాయింపులు కూడా సరిగా జరగలేదని, కానీ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మొదటి సంవత్సరం 360 కోట్లు, రెండవ సంవత్సరం 4 26 కోట్లు, మూడవ బడ్జెట్లో 500 కోట్లు కేటాయింపులు జరగడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, రవీందర్, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవి కుమార్, గోకుల్, మధు, పీఆర్ఓ కాలేరు సురేష్, ఎల్బీ స్టేడియం కోచ్లు, సిబ్బంది క్రీడాకారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

- మిషన్ భగీరథపై మంత్రి సీతక్క సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పనితీరుపై మంత్రి సీతక్క సచివాలయంలో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్య దేవరాజన్, ఇంజినీర్ఇన్‌చీఫ్ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా పరిస్థితి, నీటి నిల్వల స్థాయి, పంపిణీ వ్యవస్థపై అధికారులు సమగ్ర వివరాలు మంత్రి ముందు ఉంచారు. అధికారులు సమీక్షలో తెలియజేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లు, సోర్స్ పాయింట్ల వద్ద తగిన నీటి నిల్వలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి కొరత తలెత్తే అవకాశాలు లేవని స్పష్టం చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన "సమ్మర్ స్పెషల్ డ్రైవ్" విజయవంతంగా పూర్తి చేసామని, అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయం లేకుండా కొనసాగుతోందని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గ్రామ స్థాయిలో మిషన్ భగీరథ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని వివరించారు. ముఖ్యంగా సర్పంచులతో నేరుగా సంప్రదింపులు జరుపుతూ రోజువారీ తాగునీటి సరఫరా పరిస్థితిని తెలుసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 శాతం మంది సర్పంచులతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ సేకరించామని, వారందరూ తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా పైపులైన్ మరమ్మతులు లేదా ఇతర పనులు చేయాల్సి వస్తే, గ్రామస్తులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. అలాగే, మిషన్ భగీరథ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాని గ్రామాలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గూడాల్లో తాగునీటి కోసం బావులు తవ్వాలనే ప్రజల అభ్యర్థనలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అటువంటి ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, తక్షణమే బోర్లు, బావులు తవ్వే ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పాండ్స్ ను తవ్వాలని సూచించారు.

ఇది ప్రజా రంజక బడ్జెట్

- సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత
- ప్రజా పాలన ప్రభుత్వంలో బడుగులకు పెద్దపీట
- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా రంజక బడ్జెట్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్లో సంక్షేమ పథకాలకు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పించారని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు గత బడ్జెట్ కంటే అదనంగా దాదాపు వెయ్యి కోట్లు ప్రతిపాదించి ఈసారి 12,511 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం రాగానే 48 గంటల్లో ఆర్టీసీ మహిళలకు వచ్చిన బస్సు ప్రయాణం ప్రారంభించామని మహిళలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం బడ్జెట్ నిధులు కేటాయించిందన్నారు. 2026-27 లో మహా లక్ష్మీ పథకం కింద రూ. 4,305 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్‌లో కొత్త పథకాలు ప్రారంభించారని తెలిపారు. బడ్జెట్లో ఉద్యోగులకు, బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడంపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

మీ ప్రత్యేకతను చూపినప్పుడే విజయం

- ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా పని చేయాలి
- గ్రూప్-1కు ఎంపికైన వారికి హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: ''ఎంతో కష్టపడి చదువుకుని గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. పలు శాఖల్లో అధికారులుగా మీరు విధులు నిర్వహించనున్నారు. మీరే మీ విభాగాల్లో ప్రత్యేకతను చాటాలి. అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మీ చర్యలుండాలి. మీ ప్రతి చర్య పారదర్శకంగా ఉండాలి.. ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ఉండాలి.'' అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. గ్రూప్ 1 కేడర్‌కు ఎంపికైన ఉద్యోగుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. హైడ్రా కార్యకలాపాలను వివరించారు. ఆదిలో హైడ్రా ఎదుర్కొన్న సవాళ్లను, వాటిని అధిగమించిన తీరును తెలిపారు. హైడ్రా అంటే ప్రజల్లో పూర్తిగా అవగాహన రావడంతో తాము చేపట్టే కార్యక్రమాలకు పూర్తి స్థాయి మద్దతు లభిస్తోందన్నారు.

రాతలు కాదు.. చేతలు కనిపించాలి

'సమాజ ప్రయోజనాలు కోరి మంచి చట్టాలు రూపొందించుకున్నాం. పేపరు మీద అన్నీ ఉంటాయి.. కాని వాటిని అమలు చేయకపోతే ప్రయోజనం లేదని' హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. చెరువుల పునరుద్ధరణ, కాలువల పరిరక్షణ ఆవశ్యకతను ఈ సందర్భంగా వివరించారు. గ్రూప్ 1 అధికారులుగా ఎంపికైన వారి సందేహాలను కూడా ఈ సందర్భంగా నివృత్తి చేశారు. తాను నిర్వహించిన అన్ని విధులూ సంతృప్తినిచ్చాయని, ఎక్కడ ఉన్నా..ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని మనసారా స్వీకరించి నిబద్ధతతో పని చేయడమే తన విధానమని చెప్పారు. ప్రజలతో మమేకమై.. వారి సాదక బాధకాలు తెలుసుకోడానికి ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వారి సమస్యలను పరిష్కరించుకుంటూ పోతే.. మన విధులు తేలికవుతాయని సూచించారు. హైడ్రా కార్యకలాపాలను దగ్గరగా పరిశీలిస్తున్నామని, హైడ్రా పనితీరు మాకందరికీ మార్గదర్శకమవుతుందని కొత్తగా ఎంపికైన ఉద్యోగులు ఈ సందర్భంగా తెలిపారు.

శాంతి, సహనం, సౌభ్రాతృత్వాల పరిమళం రంజాన్

- ముస్లింలకు కేసీఆర్ శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: రంజాన్ మాసం ఆఖరి పర్వదినమైన 'ఈద్ ఉల్ ఫితర్' సందర్భంగా, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముస్లింలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభం నుంచి చివరి రోజు వరకు, ప్రతి రోజూ ప్రత్యేక దైవ ప్రార్థనలు, ఉపవాస దీక్షలు, భక్తిశ్రద్ధలతో ముస్లింలు పవిత్ర రంజాన్ మాసాన్ని ఆచరిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పరస్పర శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ప్రేమాభిమానాలు పరిమళిస్తాయని కేసీఆర్ పేర్కొన్నారు. లౌకికవాద విలువలకు ప్రాధాన్యతనిస్తూ, విభిన్న మతాల సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ, గంగాజమున తహజీబ్‌కు ప్రతీకగా బీఆర్ఎస్ పాలన కొనసాగిందని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల సంక్షేమం, ప్రగతి కోసం విద్య తదితర రంగాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వారి జీవన విధానంలో గుణాత్మక మార్పుకు దోహదం చేశాయని కేసీఆర్ అన్నారు. ప్రగతి తిరిగి పుంజుకుని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ సందర్భంగా కేసీఆర్ ఆకాంక్షించారు.

ప్రజలను దగా చేసిన కాంగ్రెస్

- ఇది ప్రజా వంచన బడ్జెట్
- మైనారిటీలకు ఎక్కువ నిధులు విడ్డూరం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 20: తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. 'మోసం, దగా.. ప్రజా వంచన బడ్జెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. 'ఆదాయాన్ని పండబెట్టి, అప్పుల కోసం అర్రులు చాచే బడ్జెట్' ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బడ్జెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటితుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

సింగరేణిలో కొత్త బావులు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, మార్చి 20: సింగరేణిలో నిరుద్యోగుల ఉపాధి అవకాశాల కోసం కొత్త బావులను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. రాజుకుమార్లు పేర్కొన్నారు. శుక్రవారం ఏరియాలోని కేకేనిపై గేటుమీటింగ్ను నిర్వహించారు. గేటు మీటింగ్లో వారు మాట్లాడారు. సింగరేణి మరో రెండు సంవత్సరాల్లో సంక్షోభంలో కూరుకపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు ఉద్యోగులకు వేతనాలు కూడ చెల్లించలేని పరిస్థితి చేరుకునే ప్రమాదం కూడ లేకపోలేదన్నారు. దీనికి ప్రధాన కారణం సింగరేణికి ప్రభుత్వం 50వేల కోట్ల బకాయిలే కారణమని అన్నారు. ఆం తేగాకుండా సింగరేణిలో ఉద్యోగుల సంబంధించిన డిమాండ్ల సాధన కోసం సీలండి పెండీని కలిస్తే ప్రస్తుతం సింగరేణి పాతబావులన్ని మూతపడనున్నాయని తద్వారా 20 వేల మంది ఉద్యోగులు ఎక్సెస్ ఉంటారని డైరెక్టర్ల సమావేశంలో సీఎండీ వెల్లడించినట్లు తెలిపారు. ఈ 30న కొత్తగూడెంలో కార్పొరేట్ కార్యాలయంలోవంటావార్పుతో బహిరంగ సభ ఉండబోతుందని దీనికి ఉద్యోగులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల కోసం ప్రాణత్యాగాలు చేసిన చరిత్ర తమ యూనియన్ అని అవసరమైతే సేవ్ సింగరేణి కోసం ఉద్యోగుల హక్కుల కోసం తాము కూడ ప్రాణత్యాగాలకు సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, సోమిశెట్టి రాజేశం, విక్రమ్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ విదానాలపై పోరాటాలు

- ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- ప్రజ సంక్షేమమం కోసమే పోరాటుబాటు
- సీపీఐ, ఏఐటీయుసీ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, మార్చి 20: సింగరేణి పాలకవర్గాలు అనుసరిస్తున్న విదానాలు ప్రజల పాలిట శాపంగా మారాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీతారామయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రాణహిత కాలనితో పాటు మందమర్రి మార్కెట్ సెంటర్లో సేవ్ సింగరేణి బస్సు జాత సందర్భంగా సభనిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ప్రజా కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆ హామీలను అమలు చేసే బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ యూనియన్ ప్రజల కోసమే సమరశీల పోరాటాలు చేయడానికి సిద్ధమైందన్నారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం అనుసరించిన విదానాలను ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కొత్త ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవని నూతన బావులు రాలేదని అన్నారు. తమ పార్టీ నాయకులెందరో ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. తామెప్పుడు అధికారం కోసం ఆరాటపడేవారము కాదని పాలకులను ప్రశ్నించడమే తమ విధానమని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పారిశ్రామిక విధానాలను తీసుకరావాలని పేర్కొన్నారు. ప్రజలందరిని, కార్మికులు, కర్షకులను చైతన్యం చేయడమే లక్ష్యంగా తాము అనేక పోరాట కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీపీఐ ఏఐటీయుసీ నాయకులు ముస్కె సమ్మయ్య, వైవి రావు. భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, రాయబారపు వెంకన్న, ఎగటి రాజేశ్వర్రావు, ముల్కలపల్లి వెంకటేశ్వరు దాసరి జనార్దన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యూఎస్‌లేకపోతే నాటో ఎందుకూ పనికిరాదు. ఆయిల్ ధరలపై ఆ దేశాలు ఫిర్యాదు చేస్తున్నాయి. కానీ హోర్ముజ్‌ను క్లియర్ చేసేందుకు మాత్రం సహాయపడట్లేదు. హోర్ముజ్‌ను క్లియర్ చేయడం ఆ దేశాలకు సులువైన పనే. ఈ వైఖరిని గుర్తుపెట్టుకుంటా.
- యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

సీఐకి సన్మానం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 20: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరం సిఐ ఎస్ రాఘవేందర్ రెడ్డి ని పెద్దపులి నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం, మరియు 5వ వార్డు సభ్యులు షాహబుద్దీన్ ఖాన్ లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరం సిఐ కి శుభాకాంక్షలు తెలియజేశారు

మహేశ్వరంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

- **ఎంపీడీవో శైలజా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం**

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి20: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మహేశ్వరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శైలజా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో శైలజా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల గృహ స్వప్నాన్ని నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ వసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల గృహ నిర్మాణ ఏఈ వెంకటేశ్వర్లు,అసిస్టెంట్ ఏఈ చైతన్య,గ్రామపంచాయతీ కార్యదర్శి సుజాత,సర్పంచ్ మునగపాటి నవీన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్,శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్,సేవాదళ్ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్,ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా,గ్రామపంచాయతీ సభ్యులు మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 20: మహేశ్వరం మండలం కల్వకోలు గ్రామంలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి, మండల ఇంచార్జ్ ఎస్సీ ఆర్పి,ఏపీఎం, సురేష్, ఎంజైరేగ్స్ ఈసీ ఆదిత్య పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం నిర్వహించారు. అలాగే ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ శ్రీనివాస్, వార్డ్ సభ్యులు తిరుమల యాదయ్య,శిరీష,మహేందర్,కొండని గీత మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఇండ్లతో సంతోషం వ్యక్తం చేస్తూ,తమ కుటుంబాలకు సురక్షిత నివాసం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రి కాదు నిర్లక్ష్యానికి అడ్డా

- **నర్వ పీహెచ్‌సీ దారుణ పరిస్థితులు**

ప్రతిపక్షం ప్రతినిధి,నారాయణపేట్, మార్చి 20: నర్వ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఉరివేసుకున్న ఘటనలో అపస్మారక స్థితిలో ఉండగా అతన్ని వెంటనే నర్వ పీహెచ్‌సీకి తరలించారు.అయితే అక్కడ పరిస్థితులు ఆశ్చర్యానికి గురిచేశాయి.అత్యవసర చికిత్స అవసరమైన సమయంలో సరైన వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం, పేషెంట్స్ గదిలో ఫ్యాన్లు పనిచేయకపోవడం గమనార్హం. ఇదే సమయంలో హాస్పిటల్ కంపౌండ్‌లో మాత్రం పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి.యువకుడి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంట వచ్చిన తల్లిదండ్రులే బట్టలతో గాలి విసిరి సహాయం చేయాల్సి వచ్చింది. అక్కడున్న నర్సు ఎలాంటి చికిత్స అందించకపోగా,ప్రశ్నించిన వారితో నిర్లక్ష్యంగా ప్రవర్తించినట్లు బాధితులు తెలిపారు.డ్యూటీలో ఉన్న డాక్టర్‌కు ఫోన్ చేసినా స్పందన రాలేదని, సి.హెచ్. ఓను సంప్రదించగా స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని వారు ఆరోపించారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి నిర్లక్ష్య ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా వైద్యాధికారి తక్షణమే నర్వ పీహెచ్‌సీని తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



భద్రాచలంలో విషాదం

- **గోదావరిలో మునిగి ఐదుగురు బీటెక్ విద్యార్థులు మృతి**

ప్రతిపక్షం, భద్రాచలం, మార్చి 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పరిధిలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది.గోదావరి నదిలో మునిగి ఐదుగురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు.వివరాల్లోకి వెళ్తే.. ఉగాది సెలవుల సందర్భంగా స్నేహితులతో కలిసి వచ్చిన విద్యార్థులు స్నానాల కోసం నదిలోకి దిగారు. ఈ ఘటన ఎటపాక మండలంలోని పురుషోత్తమపట్నం గ్రామ శివారులో ఉన్న కొల్లిగూడెం ఇసుక ర్యాంప్ సమీపంలో చోటుచేసుకుంది.అమరావతి ప్రాంతానికి చెందిన ఎస్ఆర్ఎంటీ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, భద్రాచలం ప్రాంతానికి చెందిన తమ మిత్రులు అభిరామ్, శ్రీకర్‌లతో కలిసి నదిలోకి దిగారు. ఫోటోలు తీసుకుంటూ ఉండగా ఏడుగురు యువకులు అకస్మాత్తుగా ప్రవాహంలో కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు ఈత తెలిసి ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు.గల్లంతైన వారిని అభిరామ్, శ్రీకర్, తేజ, సతీష్, నవదీప్‌లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు ప్రారంభించారు. ప్రత్యేక రిస్క్యూ బృందాలు కూడా మృతదేహాల కోసం శ్రమిస్తున్నాయి.ఈ ఘటనతో భద్రాచలం ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.

మంజీరా నదిలో చేపల మృత్యువాత

- **హత్నూర మండలం పల్పనూరు గ్రామ శివారులో వేల సంఖ్యలో మృతిచెందిన చేపలు**
- **నదిలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా కుప్పలు తెప్పలుగా పడి ఉన్న చేపలు**
- **మంజీరా నదిని కలుషితం చేస్తున్న నక్కవాగు, పరిశ్రమల వ్యర్థాలు**
- **నదిలో కలుస్తున్న గణేష్ షుగర్ ఫ్యాక్టరీ, చార్మినార్ బేవరీస్ ఫ్యాక్టరీ వ్యర్థ జలాలు**
- **సంగారెడ్డి ఎమ్మెల్యే కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికుల ఆరోపణలు**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 20 : మంజీరా జలం స్వచ్ఛతకు మారుపేరు. పరీవాహక ప్రాంత ప్రజలు ఆ నీటినే తాగేవారు. గతంలో నది వెంట పచ్చని పైర్లు కళకళలాడేవి. పలు రసాయన పరిశ్రమల నిర్వాహకుల స్వార్థం సమీప నివాస ప్రాంతాల్లోని ప్రజల మనుగడను దుర్భరంగా మారుస్తోంది. పీల్చడానికి మంచి గాలి, సురక్షిత తాగు నీరు..ప్రశాంత వాతావరణం కనుమరుగవుతోంది. పలు పరిశ్రమల నిర్వాహకులు వ్యర్థాల శుద్ధి ఖర్చును తగ్గించుకునేందుకు పరిశ్రమల రసాయన జలాలతో మంజీరా నది కాలుష్యం కోరల్లో చిక్కుతోంది. ఓ వైపు నక్కవాగు, మరో వైపు పరిశ్రమల తీరుతో సాగు, తాగు అవసరాలకు వినియోగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. తాజాగా శుక్రవారం రోజు సంగారెడ్డి జిల్లా మంజీర నదిలో చేపల మృత్యువాత పడడం తీవ్ర కలకలం రేపింది. పల్పనూరు గ్రామ శివారులో వేల సంఖ్యలో చేపలు మృతి చెందాయి. ఉదయం వేటకు వెళ్లిన మత్స్యకారులకు చేపలు కుప్పలు తెప్పలుగా కనిపించాయి. కొన్నేళ్లుగా మంజీరా నదిలో కలుస్తున్న గణేష్ షుగర్ ఫ్యాక్టరీ, చార్మినార్ బేవరీస్ ఫ్యాక్టరీ ల ద్వారా వస్తున్న వ్యర్థ జలాల ద్వారా నీరు కలుషితం అవుతోందని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అండదండలతోనే ఈ వ్యవహారమంతా నడుస్తోందని స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలను కాలువల ద్వారా నక్కవాగులోకి విడుదల చేస్తున్నారు. ఈ వాగు హత్నూర మండలం పల్పనూర్ శివారులో మంజీరాలో కలుస్తోంది. దీనికి తోడు పరిశ్రమల్లో నిల్వ చేసిన వ్యర్థ జలాలను వర్షాలు కురిసినప్పుడు వరదలో కలిపి వదులుతున్నారు. ఈ కాలుష్య జలాలూ నదిలోకి చేరుతున్నాయి. హత్నూర మండలం గుండ్లమాచనూర్, బోర్పట్ల గ్రామాల శివారులోని రసాయన పరిశ్రమల నుంచి వ్యర్థ జలాలను కాలువల ద్వారా నక్కవాగులో వదులుతున్నారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది వద్ద ఓ పరిశ్రమ, చౌటకూరు మండలం శివ్వంపేటలోని ఓ పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు భారీగా నదిలోకి కలుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతోనే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజు రోజుకు మంజీరా కాలుష్యమయమవుతోంది. సంగారెడ్డి సమీపంలోని గణేష్ షుగర్ ఫ్యాక్టరీ, చార్మినార్ బేవరీస్ ఫ్యాక్టరీల నిర్వాహకులు రసాయన వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా తరలించి నక్కవాగులోకి వదిలిన ఘటనలూ ఉన్నాయి. నక్కవాగు నీరు మంజీరా నదిలో కలుస్తున్న ప్రాంతంలో కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ కలుషిత జలాలను పొలాలకు పారించడంతో భూములు నిస్సారమవుతున్నాయి. ప్రజలు చర్మ, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. చేపలు మృత్యువాత పడుతున్నాయి. బోరు బావుల నుంచి రంగు మారిన నీరు వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆందోళనకు స్థానిక సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మద్దతు తెలిపారు. గణేష్ షుగర్ ఫ్యాక్టరీ, హైదరాబాద్ బేవరీస్ ఫ్యాక్టరీల నిర్లక్ష్యంపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మందకృష్ణ మాదిగను సన్మానించిన బూర్గుల రాజు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చ్ 20: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ వార్డు సభ్యులు బూరుగుల రాజు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి మాదిగ జాతి కోసం మీ పోరాటం దేశ చరిత్రలో నిలుస్తుందని బూరుగుల రాజు పేర్కొన్నారు,.

సురంగల్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 20: మండల పరిధిలోని సురంగల్ గ్రామంలో ముస్లిం సోదరులకు 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ శుక్రవారం ఘనంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవడం మన సంప్రదాయమని, రంజాన్ పర్వదినం అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లోనే జీపీఓలు ఉండాలి

- **14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్**

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 20: గ్రామ పాలన అధికారులు (జీపీఓలు) రెవెన్యూ కార్యాలయానికే పరిమితం కాకుండా, వారానికి మూడు రోజులు గ్రామాల్లో ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ గౌతమ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చిన్నపాటి సర్టిఫికెట్లు, భూ సమస్యల కోసం సామాన్యులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్.. పదో తరగతి పరీక్షలు ముగియగానే జీపీఓలను గ్రామాలకు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రామచందర్, లోకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి ఇల్లు ముట్టడి

- **ధర్నాకు దిగిన ఆశా కార్యకర్తలు**
- **అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ వర్కర్లకు 18000 స్థిర జీతం వేతనం నిర్ణయించాలని డిమాండ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, మార్చి 20: ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ వర్కర్లకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎన్ హెచ్ ఎం కు సరిపడి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రోజు మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు యువజనుల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి ఇంటిని ముట్టడించి ధర్నా నిర్వహించారు . ఈ ధర్నాకు ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి మిస్కింగ్ మహబూబ్నగర్ ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సాధన అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి గోవింద్ రాజ్ బలరాం వనపర్తి జిల్లా సిఐటియు నాయకులు నిక్సన్ ఎస్ రాజు మహబూబ్ నగర్ ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షులు సావిత్రి ముఖ్య వక్తలు హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశ వర్కర్లు గత 20 సంవత్సరాలు నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు అయితే వీరి సంక్షేమాన్ని కాపాడడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు .పని భారం పెరిగిపోతుంది 24 గంటలపాటు పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతనం కూడా ఇప్పటివరకు నిర్ణయం చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2023 సెప్టెంబర్ మాసంలో 15 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్లు నిరవధిక సమ్మె చేస్తున్న సందర్భంగా ప్రభుత్వం గానీ ప్రభుత్వాధికాలిచ్చిన హామిని నేటి వరకు నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆశ వర్కర్లకు కనీస వేతనం 18000 ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినప్పటికిని ఆశాల సమస్యలు పరిష్కారం చేయడంలో ముందుకు రావడం లేదని అన్నారు. 50 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ 5వేల రూపయలు మట్టి ఖర్చులు,రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షల రూపాయలు తదితర హామీలు నెరవేరలేదని విమర్శించారు. మహబూబ్నగర్ ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు సావిత్రి ,సిఐటియు నారాయణపేట జిల్లా నాయకులు నరహరి మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పారితోషకాలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఆశలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన 1500 రూపాయలు పారితోషికాలు వెంటనే అమలు చేయాలని. 2021 జులై నుండి పెండింగ్లో ఉన్న ఆరు నెలల పిఆర్సి మరియు ఏరియాస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మళ్ళీ కుష్టు వ్యాధి సర్వే, పల్స్ పోలియో ,ఎలక్షన్ డ్యూటీ ,ఎగ్జామ్ డ్యూటీ తదితర పెండింగ్ బిల్లు గత 4 సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని సంవత్సరానికి 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఆరు నెలలు వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలన్నారు అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతి పత్రం మంత్రి శ్రీహరి పిఏకి అందజేశారు. అంతకుముందు మక్తల్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుంచి మంత్రి వాకిటి శ్రీహరి ఇంటి దగ్గరకు ర్యాలీగా చేరుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డగించగా ఆశాలు పెద్ద పెట్టిన నినాదాలు చేస్తూ బారికేట్లను తోసుకుంటూ మంత్రి ఇంటి దగ్గరకు చేరుకొని గేట్ ముందు కూర్చొని గంటపాటు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నారాయణపేట మహబూబ్నగర్ వనపర్తి జిల్లాల ఆశ యూనియన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు గోవిందమ్మ, యశోద, ఇందిరమ్మ, సుజాత, లక్ష్మి, ఎస్ పార్వతమ్మ, వెంకటలక్ష్మి, ఫర్జన బేగం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 6వేల ఫోన్లను ట్యాప్ చేయించారు. ట్యాపింగ్ కేసులో చట్టప్రకారం ముందుకెళ్తున్నాం. విచారణ పూర్తికాకుండా అరెస్టులు చేయలేం. పంజాగుట్ట పీఎస్‌లోని కేసులో హరీశ్‌కు ఊరట వస్తే మొత్తానికి క్లీన్‌చిట్ వచ్చినట్లు బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. 2014 నుంచి ఫోన్ ట్యాపింగ్ జరిగింది. ఇప్పటికే ఐపీఎస్ అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశాం.

- సీఎం రేవంత్ రెడ్డి.

ప్రాంతీయం

రైతు మహోత్సవంలో రైతుల సందడి

- **ఆధునిక పద్ధతులను తెలుసుకునేందుకు ఆసక్తి**

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 20: నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజాపాలన రైతు మహోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న రైతు మేళా ఉగాది పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం ప్రారంభమైంది. ఈ రైతు మేళాలో వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, మార్క్ ఫెడ్, ఆయిల్ ఫెడ్, విజయ డెయిరీ, నాబార్డు, సహకార సంస్థలు, బ్యాంకులు, వ్యవసాయ, ఉద్యానవన, పశు సావర్ధక విశ్వ విద్యాలయాలు, బిందు సేద్యం, తుంపర సేద్యం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయ సాంకేతిక సంస్థలకు చెందిన 150 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లలో ఆయా శాఖల ద్వారా రైతులకు ఉపయోగకరమైన పరికరాలను, నమూనాలను లైవ్ స్టాకులను ఏర్పాటు చేశారు. రైతు మహోత్సవానికి హాజరై వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను రైతులు తెలుసుకునేందుకు వీలుగా ఈ ప్రదర్శనను ఈ నెల 22వ తేదీ వరకు నిర్వహిస్తారు. ప్రతి రోజు సుమారు ఐదు వేల మంది రైతులు ఈ ప్రదర్శనకు వివిధ జిల్లాల నుంచి హాజరయ్యేందుకు ప్రభుత్వం బస్సులను ఏర్పాటు చేసింది. రైతు మేళాకు హాజరయ్యే రైతులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. రైతులు ఆసక్తిగా స్టాళ్లను తిలకించారు. ప్రతి స్టాల్ వద్ద ప్రదర్శనకు పెట్టిన వాటి వివరాలను స్టాళ్ల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వాటిని ఎలా వినియోగించాలి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక వ్యవసాయ పరికరాలను పరిశీలించారు. గొర్రెల పెంపకం, తేనెటీగల పెంపకం ద్వారా తేనె ఉత్పత్తి, తేనెలో వివిధ రకాలు, తేనెతో తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను రైతులు ఆసక్తిగా గమనించారు. వివిధ రకాల ఆవుల ప్రదర్శన, నాటు కోళ్ల పెంపకం వంటి వాటిని రైతులు ఆసక్తిగా తిలకించారు.

ఆధునిక వ్యవసాయ పని ముట్లు

ఆధునిక సాంకేతికతతో తయారు చేసిన పనిముట్ల ప్రదర్శన వద్ద వాటిని వాడే విధానాన్ని రైతులు అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ ద్వారా మందుల పిచికారి, పవర్ టిల్లర్, ట్రాక్టర్లు, నాట్ వేసే యంత్రాల డెమోను రైతులు పరిశీలించారు. డిజిటల్ సాంకేతిక ప్రదర్శన స్టాల్ వద్ద వ్యవసాయానికి డిజిటల్ సాంకేతికతను ఎట్లా వాడాలో రైతులు అడిగి తెలుసుకోవడానికి ఆసక్తి కనబరిచారు

రైతు మహోత్సవానికి తరలివచ్చిన రైతులు

వివిధ జిల్లాల నుంచి రైతులు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. వ్యవసాయ స్టాళ్లను సందర్శించి సాగు పద్ధతులపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం వేదిక వద్ద వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖలకు చెందిన శాస్త్రవేత్తలు, నిపుణులు వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనుభవజ్ఞులైన రైతులు, వివిధ పంటల సాగులో అధిక దిగుబడులు సాధించిన రైతులు సాగులో తాము ఎదుర్కొన్న సమస్యలు, వాటిని అధిగమించిన విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా మధ్య మధ్యలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను రైతులు ఆసక్తిగా తిలకించారు. ఈ ఉత్సవం రైతులకు అవగాహనతో పాటు ఉత్సాహాన్ని నింపింది.

రైతు మహోత్సవంలో పుంగనూరు ఆవు

రైతు మహోత్సవంలో పుంగనూరు ఆవు పాడి రైతుల మనసు దోచుకుంది. పశుసంవర్ధక శాఖ అధికారులు ఏపీ నుంచి తెప్పించిన పుంగనూరు జాతి ఆవు రోజుకు మూడు నుంచి ఐదు లీటర్లకు పైగా పాలు ఇస్తుందని తెలిపారు. ఈ అవి పాలల్లో కొవ్వు శాతం 8 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఇక్కడి వాతావరణాన్ని తట్టుకునే ఈ ఆవులను పెంచుకోవాలని రైతులకు అధికారులు సూచించారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతు ఆదాయం రెట్టింపు: రాఘవరెడ్డి

ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. రైతు మహోత్సవంలో భాగంగా శుక్రవారం నర్మెట ఆయిల్ పామ్ కర్మాగారం వద్ద రైతు సదస్సు నిర్వహించారు. వరి, పత్తి, మిర్చి పొలాల్లో కూడా ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని చెప్పారు. రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరించి మూడు రోజుల్లోనే నగదు జమ చేస్తుందని వెల్లడించారు. రైతు మహోత్సవంలో భాగంగా ఉత్తమ సాగు దారులుగా నిలిచిన రైతులను ఆయన సత్కరించారు. ఆధునిక సాగు పరికరాలపై అవగాహన పెంచుకోవాలని రైతులకు సూచించారు.

చింతమడకలో శ్రీరామనవమి వేడుకలకు కేసీఆర్‌కు ఆహ్వానం

ప్రతిపక్షం బ్యూరో, సిద్ధిపేట, మార్చి 20: సిద్ధిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో ఈ నెల 25, 27 తేదీలలో నిర్వహించనున్న శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆకుల రామ గౌడ్, పెండల గణేష్, బైరి నర్సింహా రెడ్డి, వాతం శివ, పడకండి విశ్వనాథం, ఎల్లప్పగారి పోచయ్య తదితరులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. చింతమడక గ్రామంలో జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది. శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది.



అక్రమంగా స్థలాన్ని కబ్జా చేశారు

- **అన్యాయంగా భూ రికార్డులను తొలగించారు**

ప్రతిపక్షం బ్యూరో, సిద్ధిపేట, మార్చి 20 : అక్రమంగా తమ స్థలాన్ని కాజెయలని చూస్తున్నారని సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి కి చెందిన రైతులు ఆరోపించారు. శుక్రవారం వివాద భూమి పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 65 సంవత్సరాలుగా తమ కుటుంబమే భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోందని తెలిపారు. తమ కుటుంబానికి చెందిన కొంతమంది వ్యక్తులు కొద్ది కాలం క్రితం భూమిని అమ్ముకొని వెళ్లి ఇప్పుడు మళ్లీ స్థలం కోసం గోడకు వస్తున్నారని తెలిపారు. సర్వే నెంబర్ 974, 975, 978,979,988 1005,1006, సర్వే నెంబర్లలో సుమారు 8 ఎకరాల స్థలంలో తమ కుటుంబమే కబ్జాలో ఉందని తెలిపారు. కొంతమంది వ్యక్తులు వివాదంలోకి వచ్చి భూమిని అక్రమంగా రియల్ ఎస్టేట్ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. అధికారులను గుప్పెట్లో ఉంచుకొని భూమిని తాముకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని దీనిపై అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. సిద్దిపేటకు కూత వేటు దూరంలో ప్రధాన రహదారిపై స్థలం ఉండడంతో కోట్ల విలువ చేసే ప్రాపర్టీ కావడంతో దీనిపై కన్ను వేశారని అక్రమంగా కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. న్యాయబద్ధంగా తమ వద్ద స్థలానికి సంబంధించి అన్ని కాగితాలు ఉన్నాయని, ఈ మధ్యకాలంలోనే తమ పేరుపై ఉన్న భూ రికార్డులను అన్యాయంగా తొలగించారని తెలిపారు. గతంలో రెవెన్యూ కూడా ఈ స్థలం తమదే అని తీర్పు ఇచ్చిందని తెలిపారు. కొద్దిరోజుల క్రితమే రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కొంతమంది వ్యక్తులు ఇందులోకి వచ్చారని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నారని దీనిపై న్యాయ విచారణ జరపాలని కోరారు.

రాష్ట్ర బడ్జెట్ పై షబ్బీర్ అలీ ప్రశంసలు

- **ప్రజా అనుకూల బడ్జెట్, మైనారిటీల సంక్షేమం, సామాజిక న్యాయానికి ఊతం**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 20 : రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క సమర్పించిన 202627 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ శుక్రవారం ప్రశంసించారు. ఈ బడ్జెట్ రైతులకు, ప్రజలకు అనుకూలంగా ఉండటంతో పాటు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించడం పట్ల షబ్బీర్ అలీ స్వాగతం పలికారు. ఇది వారి సమగ్ర అభివృద్ధి, సమాన అవకాశాల పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.178 కోట్ల పెరుగుదల ఉండటం, మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను సూచిస్తుందని తెలిపారు. మైనారిటీ మహిళలకు 10 వేల కుట్టు యంత్రాల పంపిణీ, 4,655 మంది మైనారిటీ యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ వంటి కార్యక్రమాలు ఆర్థిక స్వావలంబనను పెంపొందించడంలో, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌లో మైనారిటీలను సంక్షేమ ప్రణాళికల కేంద్రంగా ఉంచి, విద్య, వ్యాపారాభివృద్ధి, ఆర్థిక స్వతంత్రతపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అలాగే రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించడం పట్ల కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరియు ఇతర వర్గాల యువతకు ఆర్థిక సహాయం అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని అన్నారు. విద్యకు ప్రాధాన్యతనిస్తూ 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' కార్యక్రమాన్ని ఆయన ప్రశంసించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలు ఏర్పాటు చేయబడుతున్నాయని, అందులో 79 పాఠశాలలకు అనుమతులు లభించగా, 44 చోట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇది అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, నైపుణ్య ఆధారిత విద్యను అందిస్తుందని అన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ సంక్షేమానికి రూ.36 వేల కోట్లకు పైగా కేటాయించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో ఎస్సీలకు రూ.11,784 కోట్లు, ఎస్టీలకు రూ.7,937 కోట్లు, బీసీలకు రూ.12,511 కోట్లు కేటాయించడం సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల విడుదలతో పాటు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కార్యక్రమాల విస్తరణ ద్వారా చారిత్రక అసమానతలను తగ్గించి, వెనుకబడిన వర్గాలకు ప్రయోజనాలు చేరేలా చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రశంసిస్తూ, ఈ బడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించిందని, రైతులు, బలహీన వర్గాలు, యువతకు ప్రాధాన్యతనిచ్చిందని అన్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌కు అనుగుణంగా సమగ్ర పాలనకు కొనసాగింపని పేర్కొన్నారు.న "ఇది రైతులకు, ప్రజలకు అనుకూలమైన బడ్జెట్. సామాజిక న్యాయాన్ని బలపరుస్తూ, ముఖ్యంగా మైనారిటీలు మరియు వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ముందడుగు వేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు.

కానిస్టేబుల్ కుమారుడిని అభినంధించిన పోలీస్ కమీషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 20 : బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ (హోమియోపతి) శిక్షణ పూర్తి చేసిన సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రవి కృష్ణ కుమారుడు రజనీకాంత్ ను పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అభినందించారు. శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల పిల్లలు ఉన్నత చదువులు చదివి, సమాజానికి ఉపయోగపడే వృత్తుల్లో స్థిరపడటం గర్వకారణమని పేర్కొన్నారు. కానిస్టేబుల్ రవి కృష్ణ కుమారుడు రజనీకాంత్ కష్టపడి చదివి హోమియోపతి డాక్టరుగా (BHMS) పట్టా పొందారు. కష్టపడి చదివి డాక్టరుగా ఎదిగిన రజనీకాంత్ ను ఆదర్శంగా తీసుకోవాలని , పోలీస్ సిబ్బంది పిల్లల చదువులకు తమ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ -మిశ్రమ బడ్జెట్

- **సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అసంతృప్తి వ్యక్తపరిచారు. ఈ బడ్జెట్ మిశ్రమ బడ్జెట్ అని, ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు లేవని, ముఖ్యంగా పెన్షన్లు రెట్టింపు చేయలేదని, గీత కార్మికులు, యాదవులు, ముదిరాజులు, చేనేత కార్మికులు వంటి వృత్తి సంఘాలకు బడ్జెట్ లో ప్రస్తావన లేదని పేర్కొన్నారు. విద్యకు 20% డిమాండ్ చేస్తుంటే 8% మాత్రమే కేటాయించారని, ఆరోగ్యానికి 4% మాత్రమే కేటాయించారని తెలిపారు..నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశా నిర్దేశం చేయలేకపోయిందని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల భర్తీపై స్పష్టత లోపించింది. నిరుద్యోగ భృతి పై ఒక్క మాట లేదు ,బడ్జెట్ కేవలం అసెంబ్లీ ప్రసంగాలకి పరిమితం కాకుండా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ తరపున కోరారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**
- **జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో వైద్యారోగ్య శిబిరం సందర్శన**

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 20 : ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువు, క్రీడలు, ఇతర అంశాలపై చక్కగా దృష్టి సారించవచ్చని హితవు పలికారు. మాక్లూర్ మండలం దాస్ నగర్ వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను రోజువారీగా తరలించేందుకు వీలుగా స్వచ్ఛ ఆటోను పాఠశాలకు పంపాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. గురుకులంలోని కిచెన్ ను, విద్యార్థినుల కోసం వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలు వినియోగించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. వివిధ విభాగాల వారీగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, చక్కటి ఆరోగ్యం కోసం ఆకు కూరలు, తాజా కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా, వెంటనే నిర్వాహకుల దృష్టికి తీసుకురావాలని, అశ్రద్ధ చేయకూడదని అన్నారు. సరైన ఆహార నియమాలను పాటిస్తూ, తగినంత నిద్ర ఉండేలా చూసుకోవాలని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థినులకు మార్గనిర్దేశం చేశారు. ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా, వార్షిక పరీక్షలను ఆత్మ విశ్వాసంతో చక్కగా రాయాలని సూచించారు. బాలికల భద్రత, రక్షణ, ఆరోగ్యాల పరిరక్షణ విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని, బయటి వ్యక్తులు ఎవరూ పాఠశాలలోనికి రాకుండా గట్టి పర్యవేక్షణ చేయాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్వేత, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న, వైద్యులు సందీప్, శశిధర్, అరవింద్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మెనూ ను తప్పక అమలు చేయాలి

- **విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్ నగేష్**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 20 : విద్యార్థులకు మెనూ ను తప్పక అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం టేక్మల్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఆగ్రో సేవకేంద్రాన్ని ,గ్యాస్ గోదామును పరిశీలించారు. కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీవీబీ పాఠశాలలో స్టోర్ రూమును, కిచెన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కేజీవీబీ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ తప్పక అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఉచిత విద్యా, అందించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగ్రో సేవకేంద్రం లో పలు రికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించారు. రైతులకు అన్ని మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియాను త్వరిత గతిన అందించాలన్నారు. గ్యాస్ వినియోగదారులు గ్యాస్ సమస్యపై చింతించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా లో సరిపడ గ్యాస్ సిలిండర్లు ఉన్నాయన్నారు. గ్యాస్ సమస్యను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ మరో శ్రీలంక కాబోతోంది. ఇది ప్రజలను వంచించే బడ్జెట్. అంకెల ఆర్భాటాలు తప్ప ఒరిగేదేమీ లేదు. ఆరు గ్యారంటీలను గాలికి వదిలేశారు. డ్రగ్స్ కేసులో సీఎంకు చిత్తశుద్ధి లేదు. ఫార్ములా ఈ, ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసులో కేసీఆర్ కుటుంబ సభ్యులను ఎందుకు అరెస్టు చేయడం లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే.

- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రాంతీయం

అల్లా దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

- పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: ఈద్ ఉల్ ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు.ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో ఒకటి రంజాన్ అని కొనియాడారు. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు.ఈ పవిత్ర మాసం దీక్షలు , ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు.గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని పేర్కొన్నారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిది అని అన్నారు.ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలి

- అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి
- ముఖ్యమంత్రి పర్యటనను అన్ని శాఖలు సమన్వయంతో చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి
- నర్మెట్టలో సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: నంగునూరు మండలం నర్మెట్టలో ఈ నెల 22న రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కార్యక్రమానికి ముందు అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కే. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ తదితరులు సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్ ఏర్పాటు ప్రాంతాలను పరిశీలించారు. పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. అలాగే రైతు మహోత్సవం నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, శిలాఫలకాల ఆవిష్కరణ, బహిరంగ సభ వంటి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.ప్రజలకు తగిన మరుగుదొడ్లు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, సౌండ్ సిస్టం, అంబులెన్స్, ఫైర్ ఇంజన్, వైద్య శిబిరం వంటి ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

‘రంజాన్ ముబారక్’ చిత్రం ఆవిష్కరణ

- అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: రంజాన్ పండుగను పురస్కరించుకుని స్థానిక రుస్తుం ఆర్ట్ గ్యాలరిలో శుక్రవారం “నూరే ఈదుల్ ఫితర్ రంజాన్ ముబారక్ చిత్రాన్ని ప్రఖ్యాత అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సమాజాలను కళావంతం చేస్తాయని అన్నారు. రంజాన్ పండుగ సోదరభావం సహజీవనం సామరస్యం ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. బిదవాడు ఆకలితో అలమటిస్తుంటే ధనవంతులు స్పందించాలని, జఖాత్ విధిగా ఉన్నవారు, లేనివారికి ఉన్నదాంట్లో కొంత రెండున్నర శాతం, తప్పకుండా దానము చేయాలని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైవసల్లం అల్ ఖురాన్ లో తెలియజేశారన్నారు. దానివల్ల ఎంతోమంది బీదలకు సహకారం అందించి వారి బాధలు తీర్చాలన్నారు. అల్ ఖురాన్ విధి విధానాలను పాటించి అల్లాబీతితో ఆరోగ్యంగా ఉండాలన్నారు.రంజాన్ పండుగ ప్రపంచ మానవాళికి సామరస్యం సౌభాతృత్వం ఐకమత్యం సుఖ సంతోషాలు శాంతి భద్రతలు అందించాలని మానవతా చిత్రకారులు రుస్తుం ఆకాక్షించి అందరికి రంజాన్ ముబారక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం నైరూప్య చిత్రకారుడు నహీంరుస్తుం, మహ్మద్ సాధిక్, ఎండి రహీం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనారుస్తుం, తదితరులు పాల్గొని రంజాన్ ముబారక్ తెలియజేశారు.

బడ్జెట్ లో మైనారిటీలకు కేటాయింపులు లేవు

- బీఆర్ఎస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ షాహేద్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందని సిద్దిపేట పట్టణ బీఆర్ఎస్ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ షాహేద్ పేర్కొన్నారు.శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ప్రత్యేకంగా మైనారిటీల కోసం ఎలాంటి స్పష్టమైన కేటాయింపులు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు.మహిళలకు నెలకు రూ. 2500 పింఛన్, ఇంద్రమ్మ ఇళ్లు, రైతు బంధు వంటి కీలక పథకాలు బడ్జెట్ లో ప్రస్తావించకపోవడం బాధాకరమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రంగంలో విఫలమైందని మహమ్మద్ షాహేద్ విమర్శించారు.

రైతుకు ఉపయోగం లేని బడ్జెట్

- రైతు సంఘాల సమాఖ్య నేత గడిల భైరవ రెడ్డి విమర్శ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన బడ్జెట్ పై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షులు గడీల భైరవరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయ రంగానికి సుమారు రూ.23,179 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.అయితే ఈ మొత్తం నుంచి ఖరీఫ్ , యాసంగి సీజన్లకు సంబంధించిన రైతు భరోసా పథకానికే సుమారు రూ.13 వేల కోట్లు వెళ్తున్నాయని, మిగిలిన నిధులు వ్యవసాయానికి సరిపోవని విమర్శించారు.ప్రతి సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్లలో అతివృష్టి, వడగళ్ల వర్షాల వల్ల పంటలు నష్టపోతున్నాయని, వ్యవసాయ యంత్రాలు, డ్రిప్ సిస్టమ్స్ వంటి అవసరాలకు మిగిలిన నిధులు చాలవని వారు పేర్కొన్నారు.పాలకులు సభలు, సమావేశాల్లో రైతులను “రాజులు” చేస్తామని చెబుతున్నప్పటికీ, ఈ బడ్జెట్ వల్ల రైతులు ఆర్థికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇది రైతుకు లాభం చేకూర్చే బడ్జెట్ కాదు, రైతును దివాలా తీసే బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు.

రంజాన్ గిఫ్ట్ ప్యాక్ ముస్లింలకు అందలేదు

- గిఫ్ట్ ప్యాక్స్ దుర్వినియోగంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్కు ఫిర్యాదు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 20 : ఎంతో పవిత్ర మాసం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ తరపున ముస్లిం పేద ప్రజలకు రంజాన్ గిఫ్ట్ ప్రభుత్వం తరపున అందించడం జరుగుతుంది కానీ మెదక్ జిల్లా కేంద్రంలో పేద ముస్లిం ప్రజలకు అందించాల్సిన రంజాన్ గిఫ్ట్ ను కొంతమంది మాత్రమే అందించి మిగతాది సంబంధిత అధికారులు కాకుండా కొందరు ప్రైవేట్ వ్యక్తులు స్వాధీనం చేసుకుని, మస్జిద్ కమిటీలకు అందించకుండా దుర్వినియోగం చేసినట్లు భారత రాష్ట్ర సమితి మెదక్ కౌన్సిలర్లు నాయకులు ఆరోపించారు.బీద ముస్లింలకు అందాల్సిన ఈ సహాయం వారికి చేరకుండా పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకుని గిఫ్ట్ ప్యాక్సను అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్ కు ఫిర్యాదు చేశారు ఇప్పటికైనా పేద ముస్లిం ప్రజలకు గిఫ్ట్ ప్యాకెట్లు అందజేయాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మెదక్ పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,కౌన్సిలర్లు బట్టి ఉదయ్, సోహెల్, జుబేర్ అహ్మద్, గౌస్ ఖురేషి, దీపక్, నాయకులు మాయా మల్లేష్,నవీన్,బాలరాజు, ఫాజిల్, ఫరూక్ పాల్గొన్నారు.

యూరియా, గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చి 20: యూరియా, గ్యాస్ కొరతను కృత్రిమంగా సృష్టించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హెచ్చరించారు. శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రంలోని రైతు అగ్రో సెంటర్‌తో పాటు ప్యాక్స్ యూరియా స్టాక్ వివరాలు, గ్యాస్ గోదామును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువులు, మందుల రికార్డులు, గ్యాస్ బుకింగ్ రికార్డులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా ఎరువులు, మందులు, గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి రైతులు, వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహిత్య కార్యశాల సమన్వయకర్త గా భైతి దుర్గయ్య

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: బాలల్లో సాహిత్యాభిరుచి కల్పించి వారిచేత రచనలు చేయించే లక్ష్యంగా తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్ వారు తెలంగాణ వ్యాప్తంగా బాల సాహిత్య కార్యశాలల నిర్వహణ కు శ్రీకారం చుట్టింది. సిద్దిపేట కు చెందిన ఉపాధ్యాయులు భైతి దుర్గయ్య ను సిద్దిపేట జిల్లా కు సమన్వయ కర్త గా నియమించింది. వీరు ఉన్నత పాఠశాలల్లో,మండల కేంద్రాల్లో విద్యార్థుల కు సాహిత్య కార్యశాలలు ఏర్పాటు చేసి వివిధ సాహిత్య ప్రక్రియల (కథలు, కవితలు,లేఖలు, వ్యాసాలు,పాటలు,పద్యాలు)లో విషయ నిపుణులతో శిక్షణ ఇప్పించే బాధ్యతలు చేపడతారని సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డా. చెన్నయ్య తెలిపారు.

జీవ ఇంధన పరిశోధనలో సంఘమిత్రకు డాక్టరేట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: విద్యారంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) యూనివర్సిటీలో జీవ ఇంధనంపై పరిశోధన చేసిన సామ@ నర్ర సంఘమిత్ర కు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. సంఘమిత్ర గతంలో ఉస్మానియా విశ్వ విద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఎంటెక్ చేసిన తర్వాత హైదరాబాద్ (BITS)బిట్స్లో పరిశోధక విద్యార్థిగా పీ.హెచ్.డి.లో చేరారు. 'డెవలప్మెంట్ అండ్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మైక్రో అల్గే బయో డీజిల్ బ్లెండ్స్ ఆల్టర్నేట్ ఫ్యూయల్ ఫర్ సీఐ ఇంజన్ ' అనే అంశంపై ఈమె పరిశోధనలు . రోజు రోజుకు ఖరీదవుతూ,పర్యావరణ కాలుష్య కారక మవుతున్న డీజిల్ కు ప్రత్యామ్నాయ పర్యావరణహితమైన జీవ ఇంధనం పై పరిశోధనలు చేశారు. సిద్దిపేట ప్రియదర్శిని నగర్ కాలనీకి చెందిన సంఘమిత్ర హైదరాబాద్ లోని బిట్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సందీప్ ఎస్ దేశ్ముఖ్ మార్గదర్శనం లో పరిశోధన చేసి థీసిస్ సమర్పించారు.కాగా ఈరోజు వైవా ఇంటర్వ్యూ నిర్వహించి డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు.

హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు,ముఖ్యంగా 6 గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు.హామీలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు.అనంతరం పరిపాలన అధికారి రాజ్ కుమార్ కు హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు.రుణమాఫీ,నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు ₹2,500 వంటి హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు.హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.6 గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు హామీ ఇచ్చిన విధంగా రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని,రైతన్నను నిలువునా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.గ్యారెంటీలు అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. వంగ రామచంద్రారెడ్డి, కొత్తపల్లి వేణు గోపాల్,బాసంగారి వెంకట్,కాసన గొట్టు సంతోష్,గాడిపల్లి భాస్కర్,,విభీషణ్ రెడ్డి,తౌడుపునూరి వెంకటేశం,మనోహర్, ప్రసాద్, అశోక్,శ్రీనివాస్,సత్యనారాయణ,కెమ్మసారం సంతోష్, సునీల్,కార్తీక్ కనకరాజు,ఉమారెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

ప్రతిపక్షం,తొగుట,మార్చి 20: భిన్నత్వంలో ఏకత్వంలా భారతీయ సాంస్కృతిలో మతసామరస్యంకు మహోన్నతమైన స్థానం ఉందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం రాత్రి ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడంతో పాటు తోఫా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాలు వేరైనా మనసులు ఒక్కటైతేనే సమాజం అభివృద్ధి చెందుతుందని, దేవాలయ ఘంటారావం, మసీదు ప్రార్థనల ధ్వని, గిర్జా మ్రోగే గంటలు ఇవన్నీ మన దేశ ఆత్మను ప్రతిబింబించే స్వరాలని, ఐఖ్యతకు పిలుపునిస్తాయన్నారు. ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణకాదని, సహనానికి, క్షమకు, దానానికి, ప్రేమకు ప్రతీకని, ఒకే వేదికపై అన్ని మతాల వారు కూర్చొని విందులో పాల్గొనడం మనమందరం ఒకటేనన్న మహోత్తర భావనకు నిదర్శనమన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో మతసామరస్యం కోసం ఎంతో కృషి చేయడం జరిగిందని, బతుకమ్మ పండుగతో పాటు రంజాన్, క్రిస్మస్ పండుగలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి సహకారం అందించడం జరిగిందన్నారు. మతంపై కాకుండా మానవత్వంపై మన విశ్వాసం ఉండాలని, విభేదాలపై కాకుండా ఐఖ్యతపై మన ప్రయాణం సాగాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బండారు స్వామిగౌడ్, పులిగారి శివయ్య, వార్డు సభ్యులు జహంగీర్, పిట్ల వెంకటేష్, మిద్దె శ్రీనివాస్, ఎంగలి నరేందర్, వద్దె నర్సింహులు, పులిగారి నర్సింహులు, జీడిపల్లి గోవర్ధన్ రెడ్డి, , పిట్ల వెంకటయ్య, ఈదుగల్ల పర్శరాములు, సుతారి రాములు, కనకరాజు, పాత్కుల బాలేష్, నవీన్, లక్ష్మణ్, చంద్రం, షాదుల్, నజీమ్, ఆజాం, స్వామి, నాగయ్య, బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఇంధన ధరలు పెంచాలని కేంద్రం ప్లాన్ చేస్తోంది. మన్మోహన్ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.400 ఉండేది. ఇప్పుడు రూ.1,100 చేశారు. రానున్న రోజుల్లో మరింతగా పెరుగుతాయి. మరోవైపు బెంగాల్‌లో అప్రకటిత రాష్ట్రపతి పాలన నడుస్తోంది. ప్రధాని మోదీ నుంచి దేశాన్ని కాపాడటమే నాకు ప్రాధాన్యం.

\- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

అధికార మార్పుకు కేరళ సిద్ధం: రాహుల్ గాంధీ

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: మరికొద్ది రోజుల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళ ప్రజలు అధికార మార్పునకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో యూడీఎఫ్ (కాంగ్రెస్ కూటమి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రముఖ వార్తాసంస్థ పీటీఐకి కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం రాష్ట్రాన్ని విదేశాల నుంచి వచ్చే నగదు, లాటరీలు, మద్యంపై ఆధారపడేలా చేస్తోందని శశిథరూర్ ఆరోపించారు. ఇక నుంచి ఈ విధానం పనిచేయదని మండిపడ్డారు. కేరళలో జరగబోయే ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రణాళిక, ఎల్‌డీఎఫ్ పదేళ్ల పాలనపై ఉన్న వ్యతిరేకత కంటే చాలా సానుకూలంగా ఉందని తెలిపారు. కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరిస్తోందని శశిథరూర్ విమర్శించారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ నాటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు అయిపోతున్నాయని, ఆ తర్వాత ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం అప్పు చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో పినరయి విజయన్ ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజలకు చూపించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమా అని అడగ్గా, థరూర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. తమ పార్టీ ధ్యేయం చాలా సానుకూలమైనదని భావిస్తున్నానని తెలిపారు. అది కేరళ 2.0కి సంబంధించినదని వివరించారు. త్వరలో కేరళలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక నామమాత్రపు పార్టీగానే మిగిలిపోతుందని శశిథరూర్ జోస్యం చెప్పారు.

విశ్వ వీక్షణం

ఇంటి పనులు దంపతులు సమానంగా చేసుకోవాలి: సుప్రీంకోర్టు

- పురుషుడు పెళ్లి చేసుకునేది పనిమనిషిని కాదు
- భార్య వంట చేయడం లేదని విడాకులు కోరిన భర్త
- ఇంటి పనుల్లో భార్యాభర్త సమానంగా పాల్గొనాలన్న న్యాయస్థానం
- పురుషుడు పెళ్లి చేసుకునేది పని మనిషిని కాదని స్పష్టీకరణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 20: వండటం, క్లీనింగ్, బట్టలు ఉతకడం లాంటి ఇంటి పనుల్లో భార్యతో సమానంగా భర్త కూడా పాల్గొనాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఎందుకంటే పురుషుడు పెళ్లి చేసుకునేది పని మనిషిని కాదని, జీవిత భాగస్వామిని అని దేశ సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. భార్య సక్రమంగా ప్రవర్తించడం లేదని, సరిగ్గా వంట వండటం లేదనే కారణాలతో విడాకులు ఇప్పించాలంటూ ఓ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అతడి అప్పీల్ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం వాదనలు విన్నది. తన క్లయింట్ (భర్త), అతడి భార్యను ఏకం చేసేందుకు జరిగిన మధ్యవర్తిత్వ ప్రయత్నాలన్నీ ఫెయిలయ్యాయని కోర్టుకు అడ్వకేట్ తెలిపారు. ఈ దంపతులకు 2017 మేలో పెళ్లి జరిగిందని, 2019 నుంచి వేర్వేరుగా ఉంటున్నారని చెప్పారు. వీరికి 8 ఏళ్ల కుమారుడు ఉన్నాడన్నారు. భర్త ప్రభుత్వ స్కూల్ టీచర్‌గా, భార్య లెక్చరర్‌గా పనిచేస్తున్నారని అడ్వకేట్ పేర్కొన్నారు. పెళ్లయిన మొదటి వారం నుంచే భార్య వల్ల తన క్లయింట్ ఇబ్బందులను ఎదుర్కొన్నాడన్నారు. భర్త, అత్తామామలతో ఆమె దురుసుగా మాట్లాడేదని, చివరకు వంట వండేందుకూ నిరాకరించేదని కోర్టుకు అడ్వకేట్ తెలిపారు. పుట్టినింటిలో బిడ్డకు జన్మనిచ్చాక నిర్వహించిన ఊయల వేడుకకు కూడా భర్త, అత్తామామలను ఆమె ఆహ్వానించలేదని ఆరోపించారు. ఈనేపథ్యంలో తన క్లయింట్ (భర్త)తో భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందనే ప్రాతిపదికన గతంలో ఫ్యామిలీ కోర్టు విడాకులను మంజూరు చేసిందని, అయితే ఆ తీర్పును కర్ణాటక హైకోర్టు కొట్టివేసిందని అడ్వకేట్ వివరించారు. తన క్లయింట్‌కు విడాకులను మంజూరు చేయాలని సుప్రీంకోర్టు బెంచ్‌కు విన్నవించారు. ఇంతకీ భర్తపై భార్య చూపించిన క్రూరత్వం ఏమిటని అడ్వకేట్‌ను సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. దీనికి అడ్వకేట్ బదులిస్తూ, భర్తతో ఆమె సక్రమంగా ప్రవర్తించడం లేదని, చివరకు ఇంట్లో వంట కూడా వండటం లేదన్నారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ స్పందిస్తూ, ఇంటి పనుల్లో భార్యాభర్త సరిసమానంగా పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు.

ఈసీ నియామకంపై పిటిషన్లు

విచారణ నుంచి తప్పుకున్న సీజేఐ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 20: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియమించే నియామక ప్యానెల్ నుంచి సీజేఐని తొలగిస్తూ తీసుకొచ్చిన (ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం 2023) చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్ల విచారణ నుంచి సీజేఐ సూర్యకాంత్ శుక్రవారం తప్పుకున్నారు. ఈ పిటిషన్లపై విచారణలో పాల్గొంటే తనపై ప్రయోజన వైరుధ్యం ఆరోపణలు వస్తాయని ఈ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీ) (నియామకాలు, సర్వీసుల కండీషన్లు, పదవీకాలం) చట్టం 2023లోని కొన్ని నిబంధనల చెల్లుబాటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. వీటిని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. ఈ క్రమంలో ఈ పిటిషన్లపై విచారణ నుంచి తాను వైదొలుగుతున్నట్లు సీజేఐ సూర్యకాంత్ ప్రకటించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం లేని న్యాయమూర్తులు ఉన్న ధర్మాసనం ఈ కేసును విచారించడం సముచితమని అభిప్రాయపడ్డారు.



ఆ 9 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దు

- విమాన యాన సంస్థలకు డీజీసీఏ సూచన

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: పశ్చిమాసియా ప్రాంతంలో ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న సైనిక ఉద్రిక్తతలు అంతర్జాతీయ విమానయాన రంగంపై ప్రభావం చూపుతున్నాయి. డ్రోన్లు, క్షిపణుల దాడులతో పరిస్థితులు రోజురోజుకీ ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని భారత పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఆ అడ్వైజరీ ప్రకారం, పశ్చిమాసియాలోని తొమ్మిది దేశాల గగనతలాన్ని భారత విమాన యాన సంస్థలు పూర్తిగా నివారించాలని స్పష్టం చేసింది. నోఫ్లై జోన్‌గా ప్రకటించిన ఈ జాబితాలో ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైట్ , లెబనాన్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్ ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఏ ఎత్తులోనైనా విమానాలు ప్రయాణించకూడదని డీజీసీఏ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న సైనిక దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో ఈ ప్రాంత గగనతలం పౌర విమానాలకు అత్యంత ప్రమాదకరంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌లోని లక్ష్యాలపై దాడులు జరిపిన తర్వాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో, యుద్ధ ముప్పు పెరిగింది.

మనసే ఒక మహాశక్తి

జీవిత గమనాన్ని మార్చే అదృశ్య సారథి!

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మనిషి జీవితం ఒక నిరంతర ప్రవాహం. ఈ ప్రయాణంలో సంపద వస్తుంది, మెరుపులా మెరిసి వెళ్ళిపోతుంది. అధికారం అలంకారప్రాయంగా వచ్చి చేరుతుంది, కాలక్రమేణా కరిగిపోతుంది. శరీరం ఒకసారి అనారోగ్యంతో కుంగిపోవచ్చు, మళ్ళీ చిగురించి బలపడవచ్చు. కానీ, ఈ ఒడిదుడుకులన్నింటినీ సమన్వయం చేస్తూ, పతన అంచున ఉన్న జీవితాన్ని విజయ తీరాలకు చేర్చే ఏకైక శక్తి మనస్సు. ఇది కేవలం ఆలోచనల పుట్ట మాత్రమే కాదు, మన జీవిత నాటకానికి దర్శకుడు, మన వ్యక్తిత్వానికి శిల్పి, అంతకుమించి మన ఉనికికి మౌన సాక్షి. ప్రాచీన జ్ఞానం. వేల ఏళ్ల నాటి భారతీయ తత్వశాస్త్రం నుండి నేటి అత్యాధునిక నాడీ విజ్ఞానం (Neuroscience) వరకు, మేధావులందరూ ఏకీభవించే ఒకే ఒక్క సత్యం మనస్సు మనిషికి అత్యంత శక్తివంతమైన వనరు. ఉపనిషత్తులు ఏనాడో ఎలుగెత్తి చాటాయి, మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. అంటే మనిషి బంధనాలకు చిక్కుకోవాలన్నా, లేదా స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలన్నా దానికి మూలకారణం మనస్సే.నేటి సైకాలజీ కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తోంది. మనం చేసే ప్రతి చిన్న పని వెనుక ఒక మానసిక ప్రేరణ ఉంటుంది. ప్రేమలో మునిగితేలాలన్నా, ద్వేషంతో రగిలిపోవాలన్నా, ఆనందంతో గంతులు వేయాలన్నా లేదా దుఃఖంతో కుమిలిపోవాలన్నా, ఆ భావోద్వేగాలన్నీ మనస్సు సృష్టించే మాయాజాలమే. అర్ధరాత్రి వేళ గుండెను పిండేసే ఒంటరితనం కావచ్చు, పర్వత శిఖరాగ్రాన నిలబడి గాలిని ఆస్వాదించినప్పుడు కలిగే అద్భుత స్వేచ్ఛా భావం కావచ్చు ఇవన్నీ మనస్సు ఇచ్చే అనుభవాలే. శరీరం కేవలం ఆయా పరిస్థితుల్లో ఉంటుంది, కానీ ఆ పరిస్థితులకు ఒక అర్థాన్ని ఇచ్చేది మాత్రం మనస్సే. మానవ మనస్సు పని తీరును మేగజైన్ భాషలో చెప్పాలంటే, అది ఒక మూడు అంతస్తుల భవనం వంటిది. మనోవిజ్ఞాన శాస్త్రం దీన్ని స్పృహ (Conscious), అర్ధ స్పృహ (Subconscious), అచేతన (Unconscious) స్థాయిలుగా విభజించింది. స్పృహ అనగా ఇది మనం రోజూ చేసే నిర్ణయాలు, తర్కాలకు వేదిక. అర్ధ స్పృహ అంటే ఇక్కడ మన అలవాట్లు, ఆటోమేటిక్ ప్రతిచర్యలు నిక్షిప్తమై ఉంటాయి. అచేతన స్థాయి గా ఇది మన లోతైన నమ్మకాలు, పాత జ్ఞాపకాల భాండాగారం. ప్రముఖ మనోవిజ్ఞాన వేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ మనస్సును సముద్రంలోని హిమఖండం (Iceberg)తో పోల్చారు. నీటి పైన కనిపించే చిన్న భాగం స్పృహ అయితే, నీటి లోపల దాగి ఉన్న భారీ భాగమే అచేతన మనస్సు . మన జీవితంలో తీసుకునే చాలా నిర్ణయాలు మనకు తెలియకుండానే ఈ లోతైన స్థాయి నుండి ప్రభావితమవుతుంటాయి. అందుకే కొన్నిసార్లు నేను ఆ పని ఎందుకు చేశానో నాకే తెలియదు అని అనుకుంటూ ఉంటాం.అయితే, ఆధునిక నాడీ విజ్ఞానం మనకు ఒక శుభవార్త చెబుతోంది. అదే న్యూరోప్లాస్టిసిటీ . మన మెదడులోని న్యూరాన్లు

స్థిరంగా ఉండవు. మన ఆలోచనలు, అలవాట్లను బట్టి మెదడు నిర్మాణం కూడా మారుతుంటుంది. అంటే, సరైన శిక్షణ ద్వారా మన మనస్సును, తద్వారా మన జీవితాన్ని మనం మలచుకోవచ్చు. చరిత్ర పుటల్లో నిలిచిన మహనీయులందరికీ ఒక సామాన్య గుణం ఉంది వారు తమ మనస్సును అదుపులో ఉంచుకున్నారు. అటల్ బిహారీ వాజ్పేయి జైలు గోడల మధ్య కూడా కవిత్వాన్ని పండించగలిగారంటే అది ఆయన మనఃస్థైర్యం. అబ్రహం లింకన్ వరుస ఓటములను చూసి కుంగిపోకుండా అమెరికా అధ్యక్షుడయ్యారంటే అది ఆయన సంకల్ప బలం. థామస్ ఎడిసన్ వేల సార్లు విఫలమైనా, నేను ఓడిపోలేదు, బల్బు వెలగని వేల మార్గాలను కనుగొన్నాను అని చెప్పడం వెనుక ఉన్నది అజేయమైన సానుకూల దృక్పథం. స్టాన్ఫోర్డ్ పరిశోధకురాలు డా. కరోల్ డ్వెక్ చెప్పిన గ్రోత్ మైండ్సెట్ (వృద్ధి చెందే మనస్తత్వం) నేడు కార్పొరేట్ ప్రపంచంలో ఒక మంత్రంలా మారింది. తెలివితేటలు పుట్టుకతో వచ్చేవి మాత్రమే కాదని, శ్రమతో పెంచుకోవచ్చని నమ్మే వారు అసాధారణ విజయాలు సాధిస్తారని ఆమె నిరూపించారు. మనస్సు ప్రశాంతంగా ఉంటే సముద్రం కూడా నిశ్చలంగా కనిపిస్తుంది, అదే మనస్సు అల్లకల్లోలంగా ఉంటే అద్దం లాంటి సరోవరం కూడా తుఫానులా భయపెడుతుంది. ఒక సగటు మనిషి మెదడులో రోజుకు 60,000 నుండి 70,000 ఆలోచనలు మెదులుతాయట. దురదృష్టవశాత్తూ, అందులో 80 శాతం ప్రతికూలమైనవే ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. మనం చేసే ప్రతి ఆలోచన మన శరీరంలోని నాడీ వ్యవస్థపై తక్షణ ప్రభావం చూపిస్తుంది మీరు ప్రతికూలంగా ఆలోచించినప్పుడు శరీరంలో కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ విడుదలవుతుంది. అదే మీరు సానుకూలంగా, సంతోషంగా ఆలోచించినప్పుడు సెరోటోనిన్, డోపమిన్ అనే ఆనంద రసాయనాలు ఊరుతాయి.

అంటే మన మనస్సు ఒక మొబైల్ ఫ్యాక్టరీ లాంటిది. మనం ఏ ఆలోచన ఆర్డర్ ఇస్తే, ఆ రసాయనం మన రక్తంలో కలుస్తుంది. అందుకే ఆధ్యాత్మిక సంప్రదాయాలు ధ్యానం, ప్రార్థనలను సూచించాయి. ఇవి కేవలం దేవుడి కోసమో, ధర్మం కోసమో కాదు.. మన అంతరంగాన్ని శుద్ధి చేసుకునే శాస్త్రీయ ప్రక్రియలు. సైకోసోమాటిక్ మెడిసిన్ అనే విభాగం ఇప్పుడు వైద్య రంగంలో కీలకంగా మారింది. మనస్సు జబ్బు పడితే శరీరం మంచాన పడుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల గుండె జబ్బులు, మధుమేహం రావడం సహజం. అదే సమయంలో ప్లేసెబో ఎఫెక్ట్ గురించి మనం వినే ఉంటాం. ఒక రోగికి అసలు మందు ఇవ్వకపోయినా, ఇది గొప్ప మందు అని నమ్మించి ఇస్తే, ఆ నమ్మకమే రోగాన్ని నయం చేస్తుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడే వారు కూడా సానుకూల మనస్తత్వంతో ఉంటే వేగంగా కోలుకుంటున్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.21 వ శతాబ్దంలో మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు మానసిక అనారోగ్యం. 2030 నాటికి ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన వ్యాధి భారంగా డిప్రెషన్ మారుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) హెచ్చరించింది. సోషల్ మీడియాలో నిరంతరం ఇతరులతో పోల్చుకోవడం, ఉద్యోగ పోటీ, సంబంధాల్లో ఉన్న ఒత్తిడి యువతను కుంగదీస్తున్నాయి. అయితే, మన సమాజంలో ఒక దురదృష్టకరమైన పోకడ ఉంది. జ్వరం వస్తే డాక్టరు వద్దకు వెళ్లడానికి సిగ్గుపడము, కానీ మనస్సుకు గాయమైతే మాత్రం దాచిపెడతాము. మానసిక చికిత్స తీసుకోవడం బలహీనత కాదు, అది ఒక అవసరం అనే స్పృహ అందరిలో రావాలి. మనస్సును కడిగి శుభ్రం చేసుకోవడం కూడా స్నానం చేసినంత సహజంగా ఉండాలి. మన అంతరంగాన్ని ఒక సుందర వనంగా మార్చుకోవడానికి ఐదు సూత్రాలు ఇక్కడ ఉన్నాయి. రోజుకు 20 నిమిషాల ఏకాగ్రత మెదడు నిర్మాణాన్ని సానుకూలంగా మారుస్తుంది. మనకు ఉన్నదానిని గుర్తించి థాంక్స్ చెప్పుకోవడం వల్ల మెదడులో నెగెటివిటీ తగ్గుతుంది. ఇది కేవలం కండరాల కోసం కాదు, మెదడు కణాల పెరుగుదల (Neurogenesis)కు అవసరం. మంచి స్నేహితులు, ఆత్మీయులతో గడిపే సమయం ఆక్సిటోసిన్ అనే హార్మోను విడుదల చేసి మనశ్శాంతిని ఇస్తుంది. నిద్ర అనేది మన మెదడుకు జరిగే సర్వీసింగ్. వ్యర్థాలను తొలగించి జ్ఞాపకాలను క్రమబద్ధీకరించడానికి ఇది ముఖ్యం. మన తెలుగు కవి శ్రీశ్రీ అన్నట్లు ఆలోచించు జగమంతా నీలోనే ఉంది. మన పూర్వీకులు ఏనాడో మనస్సు ప్రాముఖ్యతను గుర్తించారు. మనసున్న మనిషి, మంచి మనసు వంటి పదాలు మన సంస్కృతిలో భాగమయ్యాయి. చివరగా ఒక్క మాట. మనం మన ఫోన్‌ను రోజుకు ఒకసారైనా ఛార్జ్ చేస్తాం, కానీ మనస్సుకు ఆ ఛార్జింగ్ ఇస్తున్నామా? మన శరీరాన్ని రోజుకు రెండుసార్లు శుభ్రం చేసుకుంటాం, కానీ మనస్సులో పేరుకుపోయిన అసూయ, కోపం, నెగెటివిటీని వదిలించుకుంటున్నామా? మనస్సు ఒక తోట వంటిది. దాన్ని ప్రేమతో సాగు చేస్తే అద్భుతమైన జీవితం అనే పూలు పూస్తాయి. నిర్లక్ష్యం చేస్తే కలుపు మొక్కలు నిండిపోతాయి. ఆలోచనలే విత్తనాలు సానుకూల విత్తనాలను నాటండి, ప్రకాశవంతమైన భవిష్యత్తును కోసుకోండి. ఎంపిక మీ చేతిలోనే ఉంది ఎందుకంటే మీ మనస్సు మీదే!

చీఫ్ సెలెక్టర్ అగార్కర్ పదవీ కాలం పొడగింపు

భారత పురుషుల క్రికెట్ చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవి కాలం త్వరలోనే ముగియనుంది. దాంతో, అతడు తనను మరికొన్ని రోజులు కొనసాగించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలిని కోరినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే వన్డే ప్రపంచకప్ వరకూ తనకు పొడిగింపు ఇవ్వాలని అగార్కర్ విజ్ఞప్తి చేసినట్టు వస్తున్న కథనాలు వస్తున్నాయి. ఇదే విషయంపై కొందరు బీసీసీఐని సంప్రదించగా.. అదేం లేదని కొట్టిపారేసింది. చీఫ్ సెలెక్టర్‌గా వస్తూనే తనదైన ముద్ర వేసిన అగార్కర్ అనతికాలంలోనే ఫలితాలను చూపించారు. నిర్మొహమాటంగా సీనియర్లకు చెక్ పెట్టి.. ప్రతిభావంతులైన కుర్రాళ్లకు అవకాశమిచ్చిన అతడు.. టీమిండియాను ఛాంపియన్‌గా నిలిపాడనడంలో సందేహం లేదు. అయితే.. ఈ క్రమంలో ఎన్నో విమర్శలకు అతడు బలయ్యాడు. అయినా సరే నేనింతే అన్నట్టుగా ముందుకు సాగుతున్న అగార్కర్ పదవీ కాలం మరో ఆరు నెలల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో తనకు వచ్చే వరల్డ్‌కప్ 2027వరకూ పొడిగింపు ఇవ్వాలని బీసీసీఐని కోరినట్టుగా వార్తలు వచ్చాయి. అయితే.. బీసీసీఐ అధికారుల మాత్రం అవన్నీ అవాస్తవాలని చెబుతున్నారు. 'బీసీసీఐతో అగార్కర్ మాట్లాడారు. అయితే.. తన పదవీ కాలం పొడిగించాలని మాత్రం అతడు అడుగలేదు. సెలెక్షన్ కమిటీ అనేది బీసీసీఐలో ఒక సబ్ కమిటీ. ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ సెలెక్టర్ల కాంట్రాక్ట్ వర్తిస్తుంది. అజిత్ అగార్కర్ కాంట్రాక్ట్ సైతం సెప్టెంబర్‌లోనే ముగుస్తుంది. ఆ తర్వాతే బీసీసీఐ సెక్రటరీ, అగార్కర్.. పొడిగింపుపై నిర్ణయానికి వస్తారు. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం సీనియర్ సెలెక్టర్ నాలుగేళ్ల వరకు కొనసాగవచ్చు' అని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

నా కన్ను ట్రోఫీ మీదనే ఉంది

ఐపీఎల్ 19వ సీజన్‌కు సమయం దగ్గరపడడంతో కొత్త జెర్సీలతో ఫ్రాంఛైజీలు సందడి చేస్తున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పటికే జెర్సీలను విడుదల చేయగా.. పంజాబ్ కింగ్స్ సైతం తమ జెర్సీని పరిచయం చేసింది. శుక్రవారం జరిగిన వేడుకలో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, ఫ్రాంఛైజీ యాజమాన్యం విడుదల చేసింది. ఈ సందర్భంగా సారథి అయ్యర్ మాట్లాడుతూ తన కన్ను ట్రోఫీపైనే ఉందని వెల్లడించాడు. గతేడాది ట్రోఫీకి అడుగు దూరంలో ఆగిపోయిన పంజాబ్ కింగ్స్ ఈసారి టైటిల్‌పై కన్నేసింది. ఈ విషయాన్ని కొత్త జెర్సీ విడుదల సందర్భంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. 'మాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. నాకు సవాళ్లంటే ఇష్టం. అన్నింటికంటే ముఖ్యమైన విషయం.. మేము మైదానంలోకి దిగిన ప్రతిసారి గెలవాలనుకుంటాం. ఈసారి నా కన్ను ట్రోఫీపైనే ఉంది' అని అయ్యర్ పేర్కొన్నాడు. ఫ్రాంఛైజీ యాజమాన్యం,పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి అయ్యర్ కొత్త జెర్సీని ఆవిష్కరించాడు. నిరుడు ఉత్కంఠగా సాగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో ఆర్సీబీ చేతిలో ఓడిన పంజాబ్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

మూడో మ్యాచ్ కివీస్ దే

దక్షిణాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ ముందంజ వేసింది. శుక్రవారం జరిగిన మూడో టీ20 పోరులో కివీస్ 8 వికెట్ల తేడాతో సఫారీలపై ఘన విజయం సాధించింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 137 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 16.2 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ టామ్ లాథమ్(55 బంతుల్లో 63 నాటౌట్, 7ఫోర్లు, 2సిక్సులు) అర్ధసెంచరీతో అదరగొట్టాడు. సఫారీ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ తన ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, రెండు భారీ సిక్సులతో విరుచుకుపడ్డాడు. సింపాల (1/26), మహారాజ్ (1/30) ఒక్కో వికెట్ తీశారు. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 136/9 స్కోరు చేసింది. జెమీసన్ (2/42), సాంట్నర్ (2/21), సీయర్స్ (2/27) ధాటికి సఫారీ బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. మోకెనా (26 నాటౌట్) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. ఫెర్గుసన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

వుమెనిండియా సౌతాఫ్రికా టూర్

మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 ఇగా స్వియాటెక్ మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్ద లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్‌కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయం చవిచూసింది మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్ద లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 61, 57, 63తో స్వియాటెక్‌కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్‌లో తొలి రౌండ్‌లో 73 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది.

'రాకాస'లో స్నేక్ డ్యాన్స్

వీడియో సాంగ్ రిలీజ్

నిహారిక కొణిదెల నిర్మాతగా తెరకెక్కించిన 'కమిటీ కుర్రోళ్లు'తో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. ఇక ప్రస్తుతం నిహారిక జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమాను ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ని చిత్రయూనిట్ ప్రారంభించింది. ఇప్పటి వరకు 'రపప్పా', 'పదే పదే' పాటల్ని మేకర్లు రిలీజ్ చేశారు. ఇక తాజాగా ఈ మూవీ నుంచి 'స్నేక్ డ్యాన్స్' అనే పాటను విడుదల చేశారు. ఈ వీడియో సాంగ్‌ని చూస్తుంటే ఇదొక ప్రమోషనల్ గీతంగా కనిపిస్తోంది. గ్యాంగ్ అంతా కలిసి ఎంజాయ్ చేసేలా ఈ పాటను కంపోజ్ చేశారు. 'స్నేక్ డ్యాన్స్' పాటలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, సంగీత్ శోభన్, నయన్ సారిక తమ స్టైల్లో దుమ్ములేపేశారు. ఇక చివర్లో మెగా ప్రొడ్యూసర్ నిహారిక వేసిన స్టెప్పులు హైలెట్ గా నిలిచాయి. ఈ పాటకు అనుదీప్ క్యాచీ ట్యూన్‌ను ఇచ్చారు. రఘురాం సాహిత్యం ఇట్టే ఆకట్టుకునేలా ఉంది. బెన్నీ దయాల్, మనీషా పాండ్రంకి, రితేష్ జి రావు, లక్ష్మీ మేఘన, వినాయక్ గాత్రం ఈ పాటకు ప్రధాన ఆకర్షణ. రాజు ఎదురోలు ఈ మూవీకి సినిమాటోగ్రఫర్‌గా, అన్వల్ అలీ ఎడిటర్‌గా పని చేశారు. ఏప్రిల్ 3న ఈ మూవీని భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నారు.

'దేత్తడి' గ్లింప్స్ మార్చి 24న రిలీజ్

రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఆశిష్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా గ్లింప్స్ మార్చి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ చేసిన గ్లింప్స్ పోస్టర్‌లో బ్లాక్, రెడ్ షేడ్స్‌తో రా ఎనర్జీ కనిపిస్తోంది. హీరో వెనుక నుంచి కనిపిస్తూ ఫైర్ బ్రీతింగ్ యాక్ట్ చేస్తున్న విజువల్ ఆసక్తిని పెంచుతోంది. "'దేత్తడి" సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. మెయిన్ స్ట్రీమ్‌లో ఎక్కువగా చూడని అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు.

"ది ట్రైటర్స్" హోస్ట్ గా యంగ్ హీరో తేజ సజ్జా

యంగ్ హీరో తేజ సజ్జా ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త దిశగా అడుగు వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిన రియాలిటీ ఫార్మాట్ "ది ట్రైటర్స్" తెలుగు వెర్షన్‌కు ఆయన హోస్ట్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రైమ్ వీడియో ఇండియా ముంబైలో జరిగిన గ్రాండ్ ఈవెంట్ లో అధికారికంగా ప్రకటించింది. ఇటీవల వరుస సినిమాలతో సక్సెస్ సాధిస్తూ ప్రేక్షకుల్లో అద్భుతమైన క్రేజ్ తెచ్చుకున్న తేజ సజ్జ, ఇప్పుడు సినిమాలతో పాటు కొత్త ఫార్మాట్స్ వైపు కూడా దృష్టి పెట్టుతున్నారు. "ది ట్రైటర్స్ తెలుగు" ద్వారా ఆయన ప్రేక్షకులకు మరింత దగ్గరవ్వబోతున్నారు. ఈ రియాలిటీ షో ప్రపంచవ్యాప్తంగా తన ప్రత్యేక కాన్సెప్ట్‌తో పెద్ద హిట్ అయ్యింది. అదే థ్రిల్, టెన్షన్ తెలుగు వెర్షన్‌లో కూడా ఉండబోతోంది. ఈ షోలో తేజ సజ్జ ఒక కొత్త అవతార్ లో కనిపించబోతున్నారు. హోస్ట్‌గా ఆయన స్టైల్, ఎనర్జీ ఈ షోకు మరింత ప్రత్యేకత తీసుకురానుంది. ఇప్పటికే సక్సెస్ ఫుల్ యంగ్ హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తేజసజ్జా, ఇప్పుడు మల్టీ ప్లాట్‌ఫామ్ ఎంటర్టైనర్‌గా మారే దిశగా ముందుకు వెళ్తున్నారు.

'కామాఖ్య' పవర్ ఫుల్ థ్రిల్లర్

టీజర్ లాంచ్ ఈవెంట్ లో సముద్రఖని

సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న థ్రిల్లింగ్ 'కామాఖ్య'. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ PVT LTD బ్యానర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్ ని లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో యాక్టర్ సముద్రఖని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మా దర్శక నిర్మాతలకు టీమ్ అందరికీ ధన్యవాదాలు. అభిరామి మేడం గారికి నేను అభిమానిని. వారితో కలిసి నటిస్తున్న రెండో సినిమా ఇది. మరెన్నో చిత్రాలు కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాను ఈ సినిమా టైటిల్ కామాఖ్య అని చెప్పగానే మరో ఆలోచన లేకుండా చేసేద్దాం అని చెప్పాను. ఆ పవర్ నాకు తెలుసు. నా కెరీర్ లో ఒక ప్రాజెక్టు విషయంలో చాలా ఆలస్యం అయింది. ఆ సమయంలో అమ్మవారి దర్శనం కోసం వెళ్లాను. అక్కడ ఓ ఋషి నన్ను పేరుతో పిలిచి మాట్లాడారు. ఆ సందర్భంలో నా ప్రాజెక్ట్స్ సంగతి చెప్పాను. దర్శనం చేసుకొని వెళ్ళు అయిపోతుంది అన్నారు. తమిళనాడు ల్యాండ్ అయిన వెంటనే హీరోతో మీటింగ్ అనే మెసేజ్ వచ్చింది. అది అమ్మవారి పవర్. సినిమా రిలీజ్ అయిన తర్వాత మళ్ళీ అక్కడి వెళ్లి అన్నదానం చేసి వచ్చాను. సరిగ్గా ఆరు నెలలకి అభి ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పారు. చేసేద్దాం అన్నాను. ఇది ఎక్స్ ట్రార్డినరీ మూవీ. అమ్మవారి అనుగ్రహం అందరిపై వుండాలని కోరుకుంటున్నాను. తప్పకుండా అందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200